



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 282, పేజిలు - 08

సోమవారం, మార్చి 30, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## కన్నవారిని నిర్లక్ష్యం చేస్తే

# జీతంలో కోత

- తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- ప్రజా ప్రతినిధులకు సైతం వర్తింపు
- ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు వర్తింపు
- వృద్ధ తల్లిదండ్రుల భరోసా కల్పించడమే లక్ష్యమన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభ ఆదివారం ఒక చారిత్రక బిల్లుకు ఆమోదం తెలిపింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణను విస్మరించే పిల్లల విషయంలో రూపొందించిన 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' బిల్లుకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో పాటు ప్రజా ప్రతినిధులకు సైతం చట్టం వర్తిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుపై చర్చ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంగా మాట్లాడారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారని, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ఎన్నో త్యాగాలు చేస్తారని గుర్తుచేశారు. అయితే, దురదృష్టవశాత్తూ నేటి సమాజంలో చాలామంది పిల్లలు తాము స్థిరపడ్డాక కన్నవారిని పట్టించుకోకుండా గాలికొదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన బాధ్యతను గుర్తు చేయడానికే ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. 'ఈ చట్టం ప్రకారం, ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయి. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వారి పోషణ కోసం ఉద్యోగి జీతం నుండి రూ.10

2లో..

## ఇంధన కొరతపై

# వదంతులు నమ్మవద్దు

- 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాల కారణంగా ప్రధాన ఇంధన రంగాలపై నిరంతరం ప్రభావం పడుతోందని, ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సంక్షోభం ముదురుతోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ విదేశాల ప్రజలతో తన ఆలోచనలను పంచుకున్నారు. మన్ కీ బాత్ 132వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ, 'మార్చి నెల ప్రపంచ స్థాయిలో అనేక సంఘటనలతో నిండిపోయింది. గతంలో కోవిడ్ కారణంగా ప్రపంచం మొత్తం సుదీర్ఘకాలం పాటు అనేక సమస్యలను ఎదుర్కొన్నాం. కోవిడ్ సంక్షోభం నుండి బయటపడిన తర్వాత ప్రపంచం కొత్త ఆరంభంతో పురోగతి పథంలో పయనిస్తుందని అంతా ఆశించాం. కానీ ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో యుద్ధం, సంఘర్షణ పరిస్థితులు నిరంతరం తలెత్తుతూనే ఉన్నాయని' అన్నారు. భారత క్రికెట్ జట్టు టీ20 వరల్డ్ కప్ నెగ్గినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. జమ్మూ కాశ్మీర్ ప్రాంతాన్ని మిగతా రాష్ట్రాల్లా ప్రశాతంత వాతావరణం కల్పించడంతో అక్కడ క్రికెట్ డెవలప్ అయి ఏకంగా రంజీ ట్రోఫీ విజేతగా జమ్మూ కాశ్మీర్ జట్టు నిలవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. పలు రంగాల్లో దేశం మరింత

2లో..

## మంత్రి పొంగులేటిని

# బర్తరఫ్ చేయాలి

- గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై సభ సంఘాలతో విచారణకు పట్టు
- మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్న కేటీఆర్
- ప్రభుత్వం స్పందించకుంటే గవర్నర్ ను ఆశ్రయిస్తామని హెచ్చరిక

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన అవినీతి, అక్రమ మైనింగ్ ఆరోపణల నేపథ్యంలో, ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం నాడు అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అనంతరం ఈ అంశాన్ని శాసనసభలో కూడా ప్రస్తావించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,



2లో..

## కూటమి స్ఫూర్తిని మరింత

# బలోపేతం చేద్దాం

- టీడీపీ శ్రేణులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు,

2లో..

# ఇకపై మూడు ముక్కలాటలు ఉండవు

- అమరావతి అభివృద్ధే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు

- టీడీపీ 44వ ఆవిర్భావం, మంగళగిరిలో ఘనంగా వేడుకలు
- కార్యకర్తలను దూరంగా ఉంచే నేతలను నేను దూరంగా ఉంచుతా
- పార్టీ కోసం కష్టపడే వారికి ప్రజాప్రతినిధులుగా అవకాశం
- కష్టపడే వారిని గుర్తించే భాధ్యత నారా లోకేష్ కి అప్పగించిన సీఎం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది అని, వారిని నిర్లక్ష్యం చేసే నాయకులను తాను ఉపేక్షించబోనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. "కార్యకర్తలను దూరంగా ఉంచే నేతలను నేను దూరంగా ఉంచుతా. కార్యకర్తలను ఇబ్బంది పెట్టే నాయకులు మాకు అవసరం లేదు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ గుర్తుపై గెలిచి ఎమ్మెల్యేలు, మంత్రులు అయిన ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. ఈసారి వినూత్నంగా వేదికపై కార్యకర్తలను కూర్చోబెట్టి, సీనియర్ నేతలు సభికుల్లో కూర్చోవడం ద్వారా 'కార్యకర్తే అధినేత' అనే నినాదానికి ఆచరణాత్మక రూపాన్ని ఇచ్చారు.

### - ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులు అవుతారు

భవిష్యత్తులో పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే పదవులు వస్తాయని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. "రాబోయే రోజుల్లో డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా 50 శాతం సీట్లు పెరగనున్నాయి. 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయి. పార్టీ కోసం

2లో..

## సీఎం రేవంత్ రెడ్డితో

# మేనకా గాంధీ భేటీ

- వీధికుక్కలు సంరక్షణ, గోశాలల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో వీధికుక్కల సంరక్షణ, గోవుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నియంత్రణ, గోశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు మేనకా గాంధీకి వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీధికుక్కల స్టెరిలైజేషన్ కార్యక్రమ వివరాలను ఆమెకు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గోవుల సంరక్షణకు ప్రభుత్వం ఇప్పటికే పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఎన్.కె. పల్లిలో ఆధునిక వసతులతో విశాలమైన

2లో..

# న్యాయం చేయలేకపోయా.. క్షమించండి

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ధర్నాకు మద్దతిచ్చిన కవిత

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 5 లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటం మరో 'తెలంగాణ ఉద్యమం'లా కనిపిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద జేఏసీ నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపిన ఆమె, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయినందుకు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. "ఆనాటి ప్రభుత్వ నిర్ణయాల్లో నేను కూడా భాగమే, ఆ పాపంలో నాకు వాటా ఉంది. మీ జీవితాల్లో మార్పు తీసుకురాలేకపోయినందుకు మీ చెల్లిగా నన్ను క్షమించాలని కోరుతున్నాను" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ధర్నా ప్రాంగణంలో చర్చనీయాంశమయ్యాయి. ప్రభుత్వంపై ఒక్క రూపాయి అదనపు భారం పడకుండానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ,

2లో..




# కేసీఆర్, హరీశ్‌లను సీబీఐ ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదు.?

- కేంద్రాన్ని నిలదీసిన రేవంత్ రెడ్డి

2లో..



# జాబ్ క్యాలెండర్, 20 లక్షల పూచీకత్తు లేని రుణాలు

- టీవీకే పార్టీ ఎలక్షన్ మేనిఫెస్టోపై విజయ్



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్న తమిళ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ జాబ్ క్యాలెండర్, పూచీకత్తు లేని ఎడ్యుకేషన్ లోన్ సహా పలు కీలక హామీలను ప్రకటించారు. డ్రగ్స్ లేని తమిళనాడు తమ ముఖ్య లక్ష్యాలలో ఒకటిగా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ఉండేవారినే తాను అభ్యర్థులుగా ఎంపిక చేశానని

2లో..

## ఉడాన్ 2.0తో తెలుగు రాష్ట్రాలకు

# మహర్దశ

- ఆదిలాబాద్, నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించిన ఉడాన్ 2.0 పథకం ద్వారా తెలుగు రాష్ట్రాల విమానయాన రంగానికి భారీ ఊతం లభించనుంది. ఈ పథకం కింద అందుబాటులో ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను పూర్తిస్థాయి విమానాశ్రయాలుగా అభివృద్ధి చేసే అవకాశం ఉందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ముఖ్యంగా తెలంగాణలోని ఆదిలాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి ఉడాన్ స్కీమ్ బాటలు వేయనుంది. అలాగే కర్నూలు, కడప విమానాశ్రయాల నుండి దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన నగరాలకు విమాన సర్వీసులను విస్తరించేందుకు ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించిన సందర్భంగా శనివారం రాత్రి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్‌లో ప్రస్తుతం రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌ను ప్రభావితం చేయకుండా, అదనపు భూసేకరణ

2లో..

# కన్నవారిని నిర్లక్ష్యం చేస్తే జీతంలో కోత

వేలు మొత్తాన్ని ప్రతినెలా నేరుగా తల్లిదండ్రుల ఖాతాకే మళ్లించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం వృద్ధుల కోసం 2007లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం పది వేలకు మించి తల్లిదండ్రులకు ఇచ్చే అవకాశం లేదు. కన్నవారిని అనాథలుగా వదిలేసే సంస్కృతికి అడ్డుకట్ట వేయడం, వృద్ధులకు సామాజిక భద్రత కల్పించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. ఆత్మీయత, తల్లిదండ్రుల పోషణ అంశంపై చట్టం తీసుకురావాల్సిన పరిస్థితి వచ్చింది. తమ కోసం జీవితాంతం కష్టపడిన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చూడని వాళ్లు సమాజంలో బతకడానికి కూడా అనర్హులు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడి, ఉపన్యాసాలు ఇచ్చి తల్లిదండ్రుల సంరక్షణ చూసుకోని ప్రజా ప్రతినిధులకు సైతం ఈ చట్టం వర్తిస్తుందని' సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### కేటాయించిన జీతమును అడిగేందుకు ఆ తల్లిదండ్రులకు గల హక్కులు..

- ఉద్యోగికి సంబంధించి ఆధారపడిన తల్లిదండ్రులలో ఒకరు లేదా ఇద్దరు, ఉద్యోగి నెలసరి జీతంలో కేటాయింపును, కోరుతూ నియమించబడిన అధికారి సమక్షంలో నిర్ణయించిన రీతిలో రాతపూర్వకంగా దరఖాస్తు సమర్పించాలి.
- ఉద్యోగి జీతము నుంచి నియామక అధికారి ఆ కేటాయింపు చేసిన మొత్తమును నెలసరి ప్రాతిపదికపై తల్లిదండ్రులకు నేరుగా చెల్లించాలి.

అయితే ఆధారపడిన తల్లిదండ్రులు, తమ జీవనం హుందాగా గడుపుటకు వారికి సరిపడినంత ఆదాయ వనరులు ఏవీ లేవని, వారికి ఉద్యోగి నుండి ఆర్థిక మద్దతు అవసరమని విచారణ చేయకుండానే నిరూపించాలి.

-దరఖాస్తు సమర్పించిన ఆధారపడిన తల్లిదండ్రులు, అన్ని వనరుల నుండి, వారి వ్యక్తిగత నెలవారీ ఆదాయం ఏదైనా ఉన్నచో దానిని, అవసరమైన ఆర్థిక లేక ఇతర మద్దతును స్పష్టంగా తెలపాలి. నియమించిన అధికారి చట్టములోని 6వ సెక్షన్ క్రింద వచ్చిన దరఖాస్తులను న్యాయ నిర్ణయం చేయడానికి, నిర్ధారణ నిమిత్తం ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారిక ప్రకటన ద్వారా, కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్‌ను నియమించాలి.

### - అప్లికేషన్ పరిష్కరించడానికి కాలపరిమితి..

పిల్లలపై ఆధారపడిన తల్లిదండ్రుల నుండి దరఖాస్తు అందిన తరువాత నియమితులయ్యే అధికారి, సంబంధిత దరఖాస్తుదారు, ఉద్యోగి ఇద్దరికీ విన్నవించడానికి సరైన అవకాశం ఇచ్చిన తరువాత తగిన రీతిలో పరిశీలించి, క్లెయిమ్ అర్హతను నిర్ధారణ చేయాలి.

దరఖాస్తు అందిన తేదీ నుండి 60 రోజుల గడువు లోపల దరఖాస్తును పరిష్కరించాలి.

### కేటాయింపు చేసిన జీతము నిర్ధారణ..

చేసిన క్లెయిమ్ న్యాయసమ్మతమైనదని నియమించిన అధికారి సంతృప్తి చెందితే, అతను ఆ తల్లిదండ్రులకు ఉద్యోగుల జీతం నుండి కేటాయించిన భాగాన్ని మంజూరు చేయాలి. ఉత్తర్వు తేదీ తరువాత వచ్చే నెల నుండి ఆధారపడిన తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాకు నేరుగా నెలసరి ప్రాతిపదికపై చెల్లించాల్సిన మొత్తాన్ని స్పష్టముగా నిర్ధారిస్తూ సంబంధిత నియామక అధికారికి తగిన ఆదేశాలు జారీ చేయాలి. అయితే, కేటాయింపు చేసిన మొత్తము ఉద్యోగి నెలవారి మొత్తం జీతంలో 15 % శాతం మించకుండా లేదా రూ.10,000/ (రూపాయలు పది వేలు మాత్రమే) వాటిలో ఏది తక్కువ అయితే అది వర్తిస్తుంది.

### ఉద్యోగి అనగా

- ప్రభుత్వముచే నియమితులై దాని నియంత్రణ క్రింద ఉన్న, ప్రభుత్వ ఖజానా ద్వారా రాష్ట్ర సంచిత నిధి నుండి జీతం పొందుతున్న వ్యక్తి.
- తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ లేక ప్రైవేట్ నిర్వహణలో గల సంస్థలో పని చేస్తున్న వ్యక్తి.
- హైదరాబాద్ మహానగర పురపాలక కార్పోరేషన్ చట్టము, 1955, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టము 2018, తెలంగాణ పురపాలిక చట్టము 2019లోని నిబంధనల క్రింద నిర్వహిస్తున్న స్థానిక సంస్థలలోని ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులు, ఉద్యోగులు.
- తెలంగాణ జీతాలు, పింఛను చెల్లింపు, నిరర్హతల తొలగింపు చట్టము 1953లో పేర్కొన్నట్లుగా తెలంగాణ శాసనసభ, తెలంగాణ శాసన పరిషత్ కార్యవర్గ సభ్యులు, సభ్యులు.
- కార్పోరేషన్లలోని ఉద్యోగులు అనగా ప్రభుత్వ నిధులను పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు, అధికారికంగా ప్రకటించిన, షెడ్యూల్లో చేర్చిన ఇతర సంస్థలు.

### - యజమాని అనగా

- రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో లేక ఈ సెక్షన్లోని క్లాజ్ (హెచ్)లో పేర్కొన్న సంస్థ నియామకపు అధికారి.
- సంస్థ అనగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఏదైనా సంస్థ అది ప్రభుత్వ లేదా రిజిస్టరైన/లైసెన్సు పొందిన ప్రైవేటు సంస్థ/ సంస్థాపనలు.
- నిర్ణయించిన అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమాల ద్వారా నిర్ణయించిన అని అర్థం.

# ఇకపై మూడు ముక్కలాటలు ఉండవు

ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులవుతారు. క్రమశిక్షణతో పనిచేసి పార్టీని బలోపేతం చేయండి” అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను, నేతలను గుర్తించే కీలక బాధ్యతను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కు అప్పగిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రతి అంశంలోనూ పార్టీ బ్రాండ్‌ను నిలిపేలా ఆదర్శంగా ఉండాలని సూచించారు.

### చరిత్ర, వర్తమానం, భవిష్యత్ టీడీపీదే

తెలుగుదేశం పార్టీ ప్రస్థానాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. “టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రతి అడుగూ సంచలనమే, ప్రతి నిర్ణయమూ ప్రజాక్షేమమే. నాడు ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా బర్తరఫ్ చేస్తే, ప్రజలే రోడ్లపైకి వచ్చి ఉద్యమించి తిరిగి అధికారాన్ని కట్టబెట్టారు. 40 ఏళ్ల క్రితం టీడీపీ తెచ్చిన రూ.2కే కిలో బియ్యం పథకమే నేటి జాతీయ ఆహార భద్రతా చట్టానికి స్ఫూర్తి. మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వంటివి మనమే దేశానికి పరిచయం చేశాం. డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశాం. బీసీలకు రాజ్యాధికారం, ఎస్సీలకు వర్గీకరణ, ఎస్టీలు, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేశాం” అని వివరించారు.

### టీడీపీని ఫినిష్ చేస్తామన్నారు.. వాళ్లే ఫినిష్ అయ్యారు

పార్టీ ప్రస్థానంలో ఎన్నో సంక్షోభాలను, సవాళ్లను ఎదుర్కొన్నామని చంద్రబాబు అన్నారు. “టీడీపీని ఫినిష్ చేస్తామన్న వారే ఫినిష్ అయ్యారు. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారు, ప్రాణాలు కోల్పోయారు. నాపై అలిపిరిలో హత్యాయత్నం జరిగింది. 2019-24 మధ్య కాలంలో నన్ను కూడా అక్రమంగా జైల్లో పెట్టారు. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేశ్ యువగళం పాదయాత్రను అడుగడుగునా అడ్డుకున్నారు. అయినా కార్యకర్తల అండతోనే ముందుకు సాగాం. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం అంతా కార్యకర్తల త్యాగాల ఫలితమే” అని భావోద్వేగంగా ప్రసంగించారు. చంద్రయ్య అనే కార్యకర్త త్యాగాన్ని గుర్తుపెట్టుకుని, ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### 'సూపర్ సిక్స్'తో సంక్షేమ పాలన

2024 ఎన్నికల్లో బీజేపీ-జనసేనతో కలిసి చారిత్రక విజయం సాధించామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. “సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. దేశంలోనే ఎవరూ ఇవ్వని విధంగా రూ.4,000 సామాజిక పెన్షన్ ఇస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాలను అమలు చేస్తున్నాం. డీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టాం. తాజాగా 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. చెప్పినట్టుగానే 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా పరిశ్రమలను ఆకర్షిస్తున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, నిలబెట్టుకున్నాం. ఈ ఏడాది కూడా పెంచం, భవిష్యత్తులోనూ పెంచబోం” అని స్పష్టం చేశారు.

### ఒకే రాజధాని.. అభివృద్ధి ప్రణాళిక

రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికపై చంద్రబాబు స్పష్టతనిచ్చారు. “పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అమరావతిలో గతంలో ప్రారంభించిన పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం.

అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదు. ఇక మూడు ముక్కలాట లేదు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అదే అమరావతి” అని పునరుద్ఘాటించారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ, వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

### వేదికపై కార్యకర్తలు.. సరికొత్త పంథా

ఈసారి ఆవిర్భావ దినోత్సవ సభలో ఒక ప్రత్యేకత చోటుచేసుకుంది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ, పార్టీ కోసం కష్టపడిన 19 మంది సామాన్య కార్యకర్తలను వేదికపై ఆసీనులను చేశారు.

ముఖ్యమంత్రి, మంత్రులు, సీనియర్ నాయకులు సభికుల మధ్య కూర్చున్నారు. సభా నిర్వహణ బాధ్యతలను యువ నాయకురాలు కావలి గ్రీష్మకు అప్పగించారు. ఈ సందర్భంగా అండమాన్ నికోబార్ దీవుల నుంచి టీడీపీ నేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అంతకుముందు, చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి పునరంకితమవుతామని కార్యకర్తలతో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు.

# జాబ్ క్యాలెండర్, 20 లక్షల పూచీకత్తు లేని రుణాలు

విజయ్ చెప్పారు. తాను అన్ని వేళలా, అన్ని చోట్లా ఉండలేను కనుక ప్రతి అభ్యర్థిని స్వయంగా చూసి ఎంచుకుని తన ప్రతినిధులుగా నిలబెట్టినట్లు తెలిపారు. 'మన అక్కలు, చెల్లెళ్లు, అన్నలు, తమ్ముళ్లనే అభ్యర్థులుగా ఎంచుకున్నాను. ఎన్నికల్లో ఓటు వేసి వారిని ఎమ్మెల్యేలుగా గెలిపించాల్సిన బాధ్యత మీదే' అని విజయ్ కోరారు.

### టీవీకే ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన విజయ్

- డ్రగ్స్ రహిత తమిళనాడు: మాదకద్రవ్యాల రహిత రాష్ట్రాన్ని నిర్మించేందుకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తానని విజయ్ పార్టీ హామీ.
- రూ. 20 లక్షల వరకు ఎడ్యుకేషన్ లోన్: ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదనే లక్ష్యంతో 12వ తరగతి నుండి పీహెచ్‌డీ వరకు చదువుకునే వారికి ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ. 20 లక్షల వరకు విద్యా రుణాలు ఇస్తామన్న విజయ్
- జాబ్ క్యాలెండర్: ఏపీ బాటలోనే విజయ్ పయనిస్తున్నారు. ఏపీ తరహాలోనే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం పరీక్షల నిర్వహణ, నియామకాలకు సంబంధించి ఒక వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసి అమలు చేస్తామని హామీ ఇచ్చారు విజయ్.
- నిరుద్యోగ భృతి: ఏపీ, తెలంగాణలో ఇలాంటి హామీలు ఇచ్చినా అమలు చేయలేదు. తమిళనాడులోనూ టీవీకే పార్టీ నిరుద్యోగ భృతితో యువ ఓటర్లను ఆకర్షిస్తోంది. 29 ఏళ్లు దాటినా జాబ్ లభించని గ్రాడ్యుయేట్లకు నెలకు రూ. 4,000, డిప్లొమా పూర్తి చేసిన వారికి నెలకు రూ. 2 వేలు చొప్పున నిరుద్యోగ భృతి.
- స్థానికులకు ఉపాధి - ప్రైవేట్ సంస్థలకు రాయితీలు: తమ సంస్థలోని మొత్తం సిబ్బందిలో 75 శాతం మంది తమిళులను నియమించుకునే ప్రైవేట్ కంపెనీలకు రాష్ట్ర జీఎస్‌టీలో 2.5 శాతం సబ్సిడీ, విద్యుత్ ఛార్జీలలో 5 శాతం రాయితీ, ప్రభుత్వ కొనుగోళ్లలో ప్రాధాన్యత కల్పిస్తామని విజయ్ ప్రకటించారు.

### టీవీకే అభ్యర్థుల జాబితా ప్రకటించిన విజయ్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళ వెట్రి కజగం అధినేత విజయ్ అభ్యర్థుల జాబితా ప్రకటించారు. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తోంది టీవీకే పార్టీ. చెన్నై జిల్లాలోని పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుండి టీవీకే అధినేత విజయ్ బరిలోకి దిగుతున్నారు. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి ప్రధాన కూటములకు దీటుగా తన అభ్యర్థులను ఆచితూచి ఎంపిక చేసినట్లు విజయ్ స్పష్టం చేశారు. చెన్నైలోని నుంగంబాక్కంలో ఉన్న ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో అందరి వివరాలను వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ మార్చి 30న ప్రారంభం కానున్న తరుణంలో విజయ్ అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతో పాటు టీవీకే పార్టీ ఎన్నికల హామీలను ప్రకటించారు.

### ఒక ఎమ్మెల్యే ఎలా ఉండాలి?

అనంతరం ఆయన ప్రసంగిస్తూ, ఒక ఎమ్మెల్యే ఎలా ఉండాలో వివరించిన తీరు అక్కడ ఉన్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఇది కేవలం అభ్యర్థుల పరిచయ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజల రక్షకులను పరిచయం చేసే కార్యక్రమమని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పార్టీ అభ్యర్థులంతా సాధారణ కుటుంబాల నుండి వచ్చిన వారేనని, వారికి పెద్దగా బ్యాక్‌గ్రౌండ్ ఏమీ లేదని అందరూ అంటున్నారు. అయితే, ఒక ఎమ్మెల్యే అంటే ఎలా ఉండాలో చెబుతూ ఒక ఎమ్మెల్యే తన అనుభవాన్ని ప్రజలకు సేవ చేసేందుకు ఉపయోగించాలి. కానీ దోచుకునేవాడిగా ఉండకూడదు. ఎమ్మెల్యే పదవి అనేది సాధారణమైనది కాదు. ఆ నియోజకవర్గ ప్రజలకు రక్షకులుగా ఉండాలి, అనుభవం ఉందని క్వారీ పనుల్లో (మైనింగ్) నిమగ్నం కాకూడదు. కేవలం అనుభవం ఉంది కదా అని ప్రశ్నలు అడిగే జర్నలిస్టులపై దాడులు చేసేవారిలా ఉండకూడదు అన్నారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే డీఎంకే నుండి వచ్చిన ఒక ఎమ్మెల్యేపై దోపిడీ కేసులు, డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులు ఉన్నాయని, దొంగతనం కేసులో జైలుకు వెళ్లి వచ్చిన వారు కూడా ఉన్నారని విజయ్ విమర్శించారు. నేడు డీఎంకే కూటమిలో ఉంటూ నిరంతరం మద్దతు ఇస్తున్న ఒక పెద్ద నాయకుడికి వ్యతిరేకంగానే 1996 ఎన్నికల్లో ఆయనను నిలబెట్టారని తెలిపారు. ఆ నాయకుడి పేరు తాను చెప్పడం లేదని, ఇలాంటి ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని విజయ్ పేర్కొన్నారు.

# కేసీఆర్, హరీశ్‌లను సీబీఐ ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదు.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం శాసనసభలో సూటిగా ప్రశ్నించారు. ఈ అంశాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్రం వద్ద ప్రస్తావించాలని ఆయన సూచించారు. సలహాలు ఇచ్చి సభ నుంచి పారిపోవడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అలవాటుగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు.

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన అవినీతి, అక్రమ మైనింగ్ ఆరోపణలపై సభా సంఘం (హౌస్ కమిటీ) వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. సభ సజావుగా సాగేందుకు ప్రభుత్వం ఈ డిమాండ్‌కు అంగీకరించాలని బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి సూచించారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంగా మారిందని మేం మాత్రమే కాదు, దేశ ప్రధాని, కేంద్ర హోంమంత్రి సహా బీజేపీ నేతలందరూ ఆరోపించారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్, హరీశ్‌రావులను జైల్లో పెడతామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గట్టిగా చెప్పారు. వారి మాటలను నమ్మే మేము కేసును సీబీఐకి అప్పగించాం. కానీ నెలలు గడుస్తున్నా కేసీఆర్, హరీశ్‌రావులపై కేంద్రం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు” అని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని, పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు, ఓట్లు పంచుకున్నాయని ఆయన ఆరోపించారు. ముందుగా కాళేశ్వరం కేసులో కేసీఆర్, హరీశ్‌రావులకు శిక్ష పడేలా చూసిన తర్వాత బీజేపీ నేతలు సలహాలు ఇస్తే బాగుంటుందని ఆయన చురక అంటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుపై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు.

“మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లోని ప్రైవేట్ పరిశ్రమల యజమానులను హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు బెదిరించి 'ధరణి' పోర్టల్ ద్వారా వందల ఎకరాల భూమిని తన పేరు మీదకు మార్చుకున్నారు. హరీశ్‌రావు ఒప్పుకుంటే ఈ విషయంపై సభా సంఘం వేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. కేటీఆర్, వెంకటరమణారెడ్డికి హరీశ్‌రావు నిజాయితీపరుడని నమ్మకం ఉంటే, ఈ విచారణకు అంగీకరించాలి,” అని సవాల్ విసిరారు. మరోవైపు, అక్రమ మైనింగ్ ఆరోపణలపై సభను బీఆర్ఎస్ అడ్డుకోవడంపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014 నుంచి జరిగిన అక్రమ మైనింగ్‌పై ఇప్పటికే సీబీసీఐడీ విచారణకు ఆదేశించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని తెలిపారు. ప్రభుత్వమే విచారణకు ఆదేశించిన తర్వాత మళ్లీ సభా సంఘం అవసరం లేదని శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# కడియం శ్రీహరి అంటే ఖల్‌నాయక్.. తాటికొండ రాజయ్య ఫైర్

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. కడియం శ్రీహరి అసెంబ్లీలో భూకబ్జాలపై మాట్లాడటం సిగ్గుచేటు అని విమర్శించారు. అనుచరుడు గోరంత బలరాం ఆధ్వర్యంలో కడియం అంతులేని అవినీతి చేశారని ఆరోపించారు. బినామీ పేర్లతో సింగపూర్, మలేసియాలో కడియం శ్రీహరి ఆక్రమ ఆస్తులు సంపాదించారని తాటికొండ రాజయ్య మండిపడ్డారు. కడియం శ్రీహరి అంటే ఖల్ నాయక్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి, కడియం శ్రీహరి ఇద్దరు దొంగలు అని అన్నారు. వాళ్లిద్దరూ కూడా ఒకరిని మరొకరు సమర్థించుకుంటున్నారని మండిపడ్డారు.

# ఇంధన కొరతపై వదంతులు నమ్మవద్దు

ముందుకు వెళ్తోందని, అయితే సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### నెల రోజులుగా భీకర యుద్ధం

ప్రస్తుతం పశ్చిమాసియాలో నెల రోజులుగా భీకర యుద్ధం జరుగుతోందని మన్ కీ బాత్ కార్యక్రమంలో పిఎం మోదీ అన్నారు. మన లక్షలాది కుటుంబాల బంధువులు ఈ దేశాల్లో నివసిస్తున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో పని చేస్తున్నారు. 'నేను గల్ఫ్ దేశాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అక్కడ ఉన్న కోటి మందికి పైగా భారతీయులకు వారు అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నారు' అని పేర్కొన్నారు.

### పుకార్లను నమ్మవద్దు - ప్రధాని మోదీ

ఇది కచ్చితంగా సవాళ్లతో కూడుకున్న సమయం. ఈ సవాళ్ల నుంచి మనమందరం ఐక్యంగా బయటపడాలని 'మన్ కీ బాత్' ద్వారా దేశప్రజలందరినీ మళ్లీ కోరుతున్నాను. దేశప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ విషయంలో సంక్షోభ పరిస్థితి నెలకొంటోంది. మన అంతర్జాతీయ సంబంధాలు, వివిధ దేశాల నుండి అందుతున్న సహకారం, గత దశాబ్ద కాలంలో దేశం నిర్మించుకున్న సామర్థ్యం కారణంగా భారత్ ఈ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటోందని' ప్రధాని మోదీ తెలిపారు.

### అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి

ప్రధాని మోదీ దేశప్రజలను ఫిట్‌నెస్, ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఇప్పుడు 100 రోజుల కంటే తక్కువ సమయం ఉందని, ప్రపంచవ్యాప్తంగా యోగా పట్ల ఆకర్షితులవుతున్నారని ఆయన అన్నారు. ఆఫ్రికాలోని జిబౌటిలో అల్మిన్ జీ తన 'అరవింద్ యోగా సెంటర్' ద్వారా యోగాను ప్రోత్సహిస్తున్నారని ప్రధాని మోదీ తెలిపారు. ఆయన అక్కడ మరిన్ని ప్రాంతాల్లో ప్రజలకు యోగా నేర్పిస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్ యువరాజ్ దువా తన తండ్రి చక్కెర వాడకాన్ని తగ్గించాలని చేసిన విజ్ఞప్తిపై స్పందించినట్లు తెలిపారు. దానివల్ల అతడి తండ్రిపై సానుకూల ప్రభావం పడిందని పేర్కొన్నారు. దేశప్రజలు కూడా చక్కెర వాడకాన్ని తగ్గించాలని, వంట నూనె వినియోగంలో 10 శాతం తగ్గించాలని సైతం విజ్ఞప్తి చేశారు.

# కూటమి స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దాం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పార్టీ శ్రేణులందరికీ ఆయన తన అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ఐక్యత అత్యంత కీలకమని, ఈ స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. దివంగత నందమూరి తారక రామారావు 'తెలుగువారి ఆత్మ గౌరవం' అనే నినాదంతో స్థాపించిన తెలుగుదేశం పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక సంచలనం సృష్టించిందని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో బలంగా నిలబడటం వెనుక గొప్ప పోరాట చరిత్ర ఉందని అన్నారు. పార్టీ ప్రస్థానంలో ఎదురైన ఎన్నో క్లిష్ట పరిస్థితులను, ఒడిదుడుకులను చంద్రబాబు తన అపారమైన రాజకీయ అనుభవంతో అధిగమించారని కొనియాడారు. ఆయన నాయకత్వ పటిమ పార్టీ శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపిందని ప్రశంసించారు. రాజకీయ లక్ష్యాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే అజెండాగా చంద్రబాబు పార్టీని ముందుకు నడిపించిన తీరు స్ఫూర్తిదాయకమని పవన్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలోనూ, ప్రజా సమస్యలపై పోరాడటంలోనూ చంద్రబాబు తనదైన ముద్ర వేశారని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కూటమి ఐక్యతతోనే సాధ్యమని స్పష్టం చేసిన పవన్ కల్యాణ్, ఈ ఐక్యతను, స్నేహబంధాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటూ ముందుకు సాగుదామని తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఈ నిరసనలో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ, దీనిపై సభా సంఘం లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేఖ రాశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆధారాలతోనే హరీశ్ రావు ఈ కుంభకోణాన్ని బయటపెట్టారని అన్నారు. ఇతర కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, మంత్రి కుటుంబ సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కంపెనీతో మంత్రి భార్య, కుమారుడు, సోదరుడికి ప్రత్యక్ష సంబంధాలున్నాయని, 2020-22 మధ్య పొంగులేటి ఛైర్మన్‌గా ఉన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రి పొంగులేటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో సీఎంకు కూడా ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళతామని హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డితో మేనకా గాంధీ భేటీ

ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని వివరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆలయాల సమీపంలో గోశాలలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సీఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జంతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆమె ప్రశంసించారు.

ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, శనివారం నగర పర్యటనలో భాగంగా మేనకా గాంధీ ఒక యానిమల్ అంబులెన్స్‌ను ప్రారంభించారు. అనంతరం బేగంబజార్‌లో నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ యానిమల్ ఆసుపత్రి పనులను పరిశీలించారు. 27 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తికానుండటంపై ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# న్యాయం చేయలేకపోయా.. క్షమించండి

రేవంత్ రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగా ఏజెన్సీలకు కొమ్ముకాస్తోందని కవిత ఆరోపించారు. వెంటనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. “900 ఏజెన్సీలకు లాభం చేకూర్చడం కోసం 5 లక్షల మంది ఉద్యోగుల పొట్ట కొడుతున్నారు. ఏజెన్సీలకు జీఎస్టీ తగ్గించిన ప్రభుత్వం, ఆ ప్రయోజనాన్ని ఉద్యోగులకు ఎందుకు బదిలీ చేయడం లేదు?” అని ఆమె ప్రశ్నించారు. రెండు రోజుల్లోగా ఉద్యోగ భద్రతపై జీవోలు రాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### మేధావుల మౌనం.. ఉద్యోగులకు శాపం!

తెలంగాణ ఉద్యమ సమయంలో చురుగ్గా ఉన్న కోదండరాం, హరగోపాల్ వంటి మేధావుల మౌనాన్ని కవిత తప్పుబట్టారు.

గతంలో ధర్నా చౌక్ ఎత్తివేతపై మాట్లాడిన వారు, ఇప్పుడు అదే ధర్నా చౌక్ వద్ద ఉద్యోగులు ఆత్మఘోష వినిపిస్తున్నా ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. “మేధావుల మౌనం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు శాపంగా మారింది. రేవంత్ రెడ్డికి మద్దతు తెలిపిన వారు ఇప్పుడు ఈ 5 లక్షల కుటుంబాల గోడును పట్టించుకోవాలి” అని ఆమె సూచించారు.

### రాజకీయ పార్టీగా జాగృతి.. కొత్త విధానం

తెలంగాణ జాగృతి త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరించబోతోందని కవిత ఈ వేదికపై కీలక ప్రకటన చేశారు. “మా పార్టీ అధికారంలోకి వస్తే అసలు ప్రభుత్వంలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే వ్యవస్థలే ఉండవు. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు చేరాలంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ఉండాలన్నదే మా పాలసీ” అని స్పష్టం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల బాధితుల విషయంలో తాను ఎంత మొండిగా పోరాడానో, ఈ 5 లక్షల మంది ఉద్యోగుల కోసం కూడా అదే స్థాయిలో కొట్లాడుతానని భరోసా ఇచ్చారు.

### హాఫ్ మిలియన్ మార్చ్‌కు పిలుపు

“నాడు మిలియన్ మార్చ్‌తో తెలంగాణ సాధించుకున్నాం, నేడు మీ 5 లక్షల మంది 'హాఫ్ మిలియన్ మార్చ్' నిర్వహిస్తే హైదరాబాద్ వీధులు దద్దరిల్లాలి. అప్పుడే ఈ ప్రభుత్వం దిగివచ్చి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుంది” అని కవిత పిలుపునిచ్చారు. అవుట్ సోర్సింగ్ వ్యవస్థలో మహిళా ఉద్యోగులకు కనీసం ప్రసూతి సెలవులు కూడా దక్కకపోవడం దారుణమని, ఈ దోపిడీ వ్యవస్థ పోయే వరకు జాగృతి మీ వెంటే ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

# అధికారుల కనుసైగల్లో భారీ అక్రమ నిర్మాణం

**అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న ఏసిపి**

**రెసిడెన్షియల్ పర్మిషన్, కమర్షియల్ నిర్మాణం**

**“అందరికీ ఇచ్చాం, ఏం చేస్తారో చేసుకోండి” అన్న ధీమా**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) యూసుఫ్ గూడ సర్కిల్ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం, బిల్డర్ల ధైర్యం కలిసి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మించడం ఇప్పుడు సాధారణ వ్యవహారంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల సమాచారం ప్రకారం రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని బిల్డర్ కమర్షియల్ నిర్మాణం చేపట్టాడు. భవనంలో స్టిల్ట్ ఫ్లోర్‌ను పూర్తిగా వ్యాపార కార్యకలాపాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్ సమస్య ఏర్పడుతుందని దీంతో కాలనీ ప్రశాంతత దెబ్బతింటుందని, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆ తర్వాత చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. నోటీసులు ఇచ్చి ఆగిపోవడం వెనుక సెటిల్మెంట్లు జరిగాయా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు చేయకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

### అధికారులందరికీ ఇచ్చాం, ఏం చేస్తారో చేసుకోండి..

స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారులకు కావలసింది ఇచ్చాము అంటు బిల్డర్ బహిరంగంగానే ధీమా వ్యక్తం చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలే అధికారుల పనితీరుపై అనుమానాలు పెంచుతున్నాయి.యూసుఫ్ గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏసీపీ రమేష్, టీపీఎస్ నాయక్‌ల బాధ్యత రాహిత్యం వల్లే ఇలాంటి అక్రమాలు పెరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం వెనుక అసలు కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ భవనాలు కట్టడం చట్ట విరుద్ధమని తెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల మౌనమే, బిల్డర్ల కు ధైర్యంగా మారిందని యూసుఫ్ గూడలో అక్రమ నిర్మాణాలకు ఎవరు అడ్డుకట్ట వేస్తారో వేచి చూడాలి.

### పసిపిల్లల ప్రాణాలతో ఆటో డ్రైవర్ చెలగాటం..

## సరదా కోసం పిల్లాడితో డ్రైవింగ్



కారేపల్లి : సెలవు దినం కావడంతో(ఆదివారం) ఆటలాడుకుంటున్న అమాయక పిల్లల్ని మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి తన సరదా కోసం ప్రమాదానికి గురిచేసిన సంఘటన ఆదివారం ఖమ్మం జిల్లా సింగరేణి మండలం జమాలపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరుపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ యజమాని వజ్జ సునీల్ అనే యువకుడు అతిగా మద్యం సేవించాడు.గ్రామంలో సరదాగా ఆడుకుంటున్న ఆరుగురు విద్యార్థులను ఆటోలో ఎక్కించుకున్నాడు. పేరుపల్లి నుండి కోటిలింగాల వెళ్లే మార్గంలో విద్యార్థులను ఎక్కించుకొని ఆటో చెక్కర్లు కొడుతూ తీసుకెళ్లాడు. అయితే జమాల్లపల్లి సమీపంలో తను నడుపుతున్న ఆటోను నిబంధనలకు విరుద్ధంగా ఓ విద్యార్థికి ఇచ్చాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు పులసం యశ్వంత్, అలెం స్నేహిత్, ధనసరి భరత్, అలెం తేజ, అలెం చిట్టూ, ధనసరి ప్రవీణులకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను స్థానికులు కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పులసం యశ్వంత్,అలెం స్నేహిత్ లకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

## మోసం చేయడం,వెన్నుపోట్లు పొడవడం కడియంకు బాగా అలవాటు : ఎమ్మెల్యే పల్లా



హైదరాబాద్ : మోసం చేయడం,వెన్నుపోట్లు పొడవడం పార్టీలు మారే ఎమ్మెల్యే కడియం శ్రీవారికి బాగా అలవాటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి( మీూా ౹ఋశ్రీశ్రీఋ =ఋయవంష్ట్రఋుతీ =వుఎఎఎ ) ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరి ఏ కులానికి చెందినవాడు.? ఏ సామజికవర్గానికి చెందినవాడంటూ గతంలో ఇదే రేవంత్ రెడ్డి మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కడియంను ముఖ్యమంత్రి పొగడ్తలతో ముంచెత్తుతున్నాడని విమర్శించారు. కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పాలని, బీఆర్ఎస్ సభ్యుడివైతే, సిగ్గు ఉంటే బీఆర్ఎస్ సీట్లో వచ్చి కూర్చోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రికి రెండు నాలుకలు కాదు నాలుగు నాలుకలతో ఇష్టమున్నట్లు మాట్లాడుతు న్నారని విమర్శించారు. కడియం శ్రీహరి గురించి మాట్లాడడం దండగ అని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన తప్పులను గమనించిన సీఎం ఆయన మంత్రి పదవి తొలగింపు తప్పదనే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అనని మాటలను ఆపాదిస్తూ అసెంబ్లీలో అధికార పార్టీ సభ్యులు దుమారం రేపారని పేర్కొన్నారు. డబ్బులు, పదవుల కోసం కడియం ఎంతటి దిగజారుడుతనానికైనా దిగుతారని విమర్శించారు.

### హౌస్ కమిటీ వేయమంటే ఎందుకంత భయం..

## కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశ్నించిన సునీతా లక్ష్మారెడ్డి



అసెంబ్లీ నడిచిన తీరు బాధాకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలపై మాట్లాడటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. హౌస్ కమిటీ వేయమంటే ఎందుకు భయమని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సునీతా లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావుపై సీఎం ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మైనింగ్‌పై మాట్లాడితే మైక్ ఇవ్వమని అంటున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై మాట్లాడితే సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర వార్తలుకడియం శ్రీహరి ఏ పార్టీ అని కౌశిక్ రెడ్డి అడిగారని సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. అందులో తప్పేముందని ప్రశ్నించారు. మైనింగ్ ఇష్యూను డైవర్షన్ చేసేలా సభను నడిపారని అన్నారు. రెండున్నరేళ్లుగా ప్రభుత్వం అసెంబ్లీ కమిటీలు వేయలేదని తెలిపారు. ప్రతిపక్షం గొంతు నొక్కాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని పేర్కొన్నారు.

### మూడేళ్ల కొడుకుతో

## కలిసి కాలువలో దూకిన తల్లి..



వరంగల్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ తల్లి తన మూడేళ్ల కొడుకును చున్నీతో ముడేసుకుని కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ పరిధిలో వెలుగుచూసింది.కళ్యాణి(24) అనే వివాహిత తన కొడుకు శ్రేయాన్ష్(3)తో సహా ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లీకొడుకు కాలువలోకి దూకిన సమయంలో అందులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. సమాచారమందుకున్న అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో చాలా సమయం పట్టింది. అధికారులు దాదాపు 7 గంటలు గాలింపు చర్యలు చేపట్టి తల్లీకొడుకు మృతదేహాలను వెలికి తీశారు.కళ్యాణి పెదవులను చేపలు పూర్తిగా తినేసినట్లు గుర్తించారు. వరకట్న వేధింపులే ఈ దారుణానికి కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అధికారుల కక్కుర్తి..

### వెంచర్ కోసం 11KV వైర్ మాయం..!



నర్సాపూర్: అది వ్యవసాయ పొలాలకు కరెంట్ సరఫరా చేసే 11 కేవీ వైర్. ఆ వైర్ల ద్వారా రైతులకు విద్యుత్ సరఫరా చేయాల్సిన అధికారులు వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వెలుగుచూసింది.మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ డీసీ బార్ సమీపంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే 11 కేవీ వైర్లను కింది స్థాయి సిబ్బంది తొలగించి విలువైన అల్యూమినియం వైర్‌ను బ్లాక్‌లో అమ్ముకున్నారు. అయితే డీసీ బార్ వెనకాల నూతనంగా ఓ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వెంచర్ యాజమాని ఇచ్చే డబ్బులకు అమ్ముడుపోయి పొలాలకు వెళ్లే కరెంట్ వైర్ తొలగించడం పట్ల పలువురు రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ పొలాలలో ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి కరెంటు తీగలను తొలగించిన సదరు ట్రాన్స్ కో సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై మెదక్ డీఈఈ స్వామిని వివరణ కోరగా అనుమతులు లేకుండా వైర్లను తొలగించిన వారిపై చట్టపైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఎన్ని విచారణలు వేసినా.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం: సబితా ఇంద్రారెడ్డి

అసెంబ్లీలో తమకు మైక్ ఇవ్వడం లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైక్ ఇచ్చినా కూడా కట్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. జీరో అవర్‌ను గంటలు గంటలుగా నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రశ్నలు లేవనెత్తినా సూటిగా సమాధానం ఇవ్వడం లేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కాంగ్రెస్ ఏం చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు. చాలా కుంభకోణాలు బయటపెడితే సమాధానం ఉండదని అన్నారు. అక్రమ మైనింగ్‌ను హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. మైనింగ్‌ను సీజ్ చేయకుండా నోటీసులు ఇవ్వమేంటని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు కాంగ్రెస్‌కు భయమెందుకు అని అడిగారు. ప్రభుత్వ అవినీతిని సభలో ప్రస్తావిస్తున్నామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదని అన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.ప్రతిపక్షంగా ప్రజల సమస్యలు ఎత్తి చూపిస్తామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కులాన్ని తీసుకొచ్చి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సీతక్కను ఏమని అవమానించామని ప్రశ్నించారు. రైతుబంధు, యూరియా, నీళ్లు వస్తలేవని అడగొద్దా అని నిలదీశారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలే కదా మాట్లాడేదని అని అడిగారు. మూసీ పేరుతో పేదల ఇండ్లను కూల్చొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములను లాక్కోవద్దంటున్నామని అన్నారు. సీఎం వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఉన్నతమైన వ్యక్తిగానే స్పీకర్‌ను గౌరవించామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.

## ఉడాన్ 2.0తో తెలుగు రాష్ట్రాలకు మహర్దశ

ద్వారా కొత్త విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్‌లలో సైతం ఎయిర్ పోర్ట్ నిర్మించేందుకు అవకాశాలు పెరిగినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కింద ట్రాఫిక్ టన్నెల్ నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఖర్చు భరిస్తే అనుమతులు ఇస్తామన్నారు.

### జూన్‌కల్లా భోగాపురం ఎయిర్‌పోర్ట్ పూర్తి

ఉడాన్ 2.0 కోసం కేటాయించిన రూ.28 వేల కోట్లలో, 100 విమానాశ్రయాల అభివృద్ధికి రూ.12 వేల కోట్లు, హెలిపోర్టుల కోసం రూ.3,500 కోట్లు, దాంతోపాటు విమానయాన సంస్థలకు ప్రోత్సాహకంగా రూ.10 వేల కోట్లు వెచ్చించనున్నట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఏపీలోని భోగాపురం, విస్తరించిన విజయవాడ విమానాశ్రయాలు వచ్చే ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

### జూన్‌లో వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన

తెలంగాణలోని వరంగల్ సమీపంలో ఉన్న మామునూరు విమానాశ్రయానికి జూన్ నెలలో శంకుస్థాపన చేసేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ అంతర్‌మంత్రిత్వ శాఖల సంప్రదింపుల దశలో ఉంది. మామునూరు ఎయిర్‌పోర్టులో భాగస్వామ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కానీ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించే ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టుల్లో అలాంటి విధానాలు లేవని స్పష్టం చేశారు. కొత్తగూడెం, బసంత్‌నగర్ విమానాశ్రయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాల్సి ఉంది. మరోవైపు, దేశీయంగా విమానాల తయారీపై ఎంబ్రాయిర్ సంస్థ కీలక నిర్ణయం తీసుకోబోతోంది. 2028 నాటికి భారత్‌లో తయారైన తొలి విమానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ఆ సంస్థ లక్ష్యమని మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

### దేశంలో కొత్తగా 100 ఎయిర్‌పోర్ట్‌లు

విమానయాన రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.28,840 కోట్ల వ్యయంతో ఉడాన్ 2.0 పథకానికి శ్రీకారం చుట్టింది. 2026 నుండి పదేళ్ల కాలపరిమితితో దేశవ్యాప్తంగా 100 కొత్త విమానాశ్రయాలు, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్‌ను నిర్మించడమే దీని లక్ష్యం. ముఖ్యంగా టైర్-2, టైర్-3 పట్టణాలు, సరిహద్దు ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేయనున్నారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, ఆర్థిక వృద్ధికి, ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేయనున్నారు.

### తెలుగు ఆత్మ గౌరవానికి

## ప్రతీక తెలుగు దేశం పార్టీ

**- ఎన్టీఆర్ ఆశయాలతో ముందుకు సాగుతున్న తెదేపా**

**- 44 ఏళ్ల తెదేపా ప్రయాణం గొప్పది**

**- తెదేపా కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి, విశ్వకర్మ, విశ్వబ్రహ్మణ ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు : చెల్లోజు రాజు**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)తెలుగు దేశం పార్టీ స్థాపించి 44 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో టీడీపీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి, విశ్వకర్మ--విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లోజు రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు స్థాపించబడిన తెలుగు దేశం పార్టీ 44 ఏళ్ల ప్రయాణం ఎంతో గొప్పదని అన్నారు. పార్టీ స్థాపకుడు నందమూరి తారక రామారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లుతూ పార్టీ నేటికీ ప్రజల కోసం పనిచేస్తోందని తెలిపారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు దేశంలోనే అభివృద్ధి, సాంకేతికత, పారదర్శక పాలనకు నాంది పలికిన దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని,యువతకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.తెలుగు దేశం పార్టీ ఎప్పటికీ పేదల, బలహీన వర్గాల పక్షాన నిలబడి ప్రజాసేవలో ముందుంటుందని, భవిష్యత్తులో మరింత బలంగా ప్రజల మద్దతుతో ముందుకు సాగుతుందని చెల్లోజు రాజు స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు అందరూ ఐక్యంగా పని చేసి పార్టీని మరింత శక్తివంతం చేయాలని పిలుపునిచ్చారు.లియోన్స్ క్లబ్ ఫౌండర్ రాకేష్ కోట కు గౌరవ డాక్టరేట్ సత్కారంహైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఇంటర్నేషనల్ డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ యూఎస్ఏ 2026 సంవత్సరమునకు గాను గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా గౌరవ డాక్టరేట్ ప్రధానోత్సవం హైదరాబాదులో ఘనంగా జరిగింది. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సోషల్ సర్వీస్ విభాగంలో యువ పారిశ్రామికవేత్త లియోన్స్ క్లబ్ ఫౌండర్ అయిన రాకేష్ కోట కి గౌరవ డాక్టరేట్ సత్కారం జరిగినది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 9 మందికి వివిధ విభాగాలలో వారి అత్యున్నత సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ప్రధానం జరిగినది. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీత కోట రాకేష్ మాట్లాడుతూ ఇలాంటి గుర్తింపు రావడానికి కారణమైన తన వ్యక్తిత్వ నిర్మాణంలో ముఖ్యమైన వ్యక్తి అయిన తన అమ్మగారైన కోట విజయ కుమారి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి ఎస్ హెచ్ ఎస్ యూనివర్సిటీ కి చెందిన అధికారులు పలువురు ,సినీ ప్రముఖులు పాల్గొనగా గౌరవ అతిథిగా డాక్టర్ బాబు మోహన్ అవార్డులను ప్రధానం చేసినారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**- ఎస్సై శ్రీనివాస్**



కుభీర్ : రోడ్డు భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో మండలంలో అరైవ్- అలైవ్ కార్యక్రమం కొనసాగుతోందని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పార్డి (కె), తదితర గ్రామాల్లో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడడం మానేయాలన్నారు.టీనేజ్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, 18 సంవత్సరాల నిండని వారు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతను పెంచడం , చట్టాన్ని గౌరవించే వాతావరణాన్ని కల్పించడం పోలీసుల ముఖ్య ఉద్దేశమని అన్నారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బందెల గంగమణి సత్యనారాయణ, ఉప సర్పంచ్ నాయుడు పోశెట్టి, మాజీ వైస్ ఎంపీపీ బి. శంకర్, వీడీసీ అధ్యక్షుడు దుంపేటి రాములు, గోజల గజ్జరాం, పోలీసు సిబ్బంది, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పార్టీ గుర్తించిన తొమ్మిది మంది కార్యకర్తలను సన్మానించిన : మంత్రి నారాయణ




నెల్లూరు (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు శ్రమించిన తొమ్మిది మంది క్రియాశీలక సభ్యులను గోమతి నగర్ క్యాంప్ కార్యాలయంలో మంత్రి నారాయణ వేదికపై ప్రత్యేకంగా సన్మానించారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, మెంబర్‌షిప్ డ్రైవ్, సుపరిపాలన ఐటీడీపీ యాప్ వంటి కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మామిడాల మధు ,కపిర శ్రీనివాసులు, కాకర్ల తిరుమల రావు, పొత్తూరి శైలజ, మహేష్, కలివేటి రవి, ఎగుటూరి సతీష్, తురిమెర్ల పెంచలయ్య ఐటీడీపీ నుండి సుధాకర్ బాబును నిబద్ధతను రాష్ట్ర పార్టీ ప్రత్యేకంగా గుర్తించిందని. వీరి అంకితభావాన్ని కొనియాడుతూ మంత్రి నారాయణ స్వయంగా వారిని గౌరవించడం విశేషం. క్రమశిక్షణతో పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, ఈ తొమ్మిది మంది కృషి మిగతా వారందరికీ ఆదర్శమని మంత్రి పేర్కొన్నారు.సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి నిస్వార్థంగా కృషిచేస్తామని సన్మాన గ్రహీతలతో పాటు పార్టీ కార్యకర్తలు ,నేతలతో ప్రతిజ్ఞ చేయించారు.

## వటపత్రశాయి అలంకారంలో జనహిత రాముడు వైభవం



ఒంటిమిట్ట (ప్రశ్న న్యూస్)శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం స్వామివారు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి అందరినీ ఆకట్టుకున్నారు.ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించగా, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు భక్తిరసంతో నిండిపోయింది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం జలప్రళయం సంభవించినప్పుడు శ్రీమహావిష్ణువు మర్రి ఆకుపై తేలియాడుతూ చిన్న శిశువుగా దర్శనమిస్తారు.

కుడికాలి బొటనవేలిని నోటిలో పెట్టుకుని ఆనందంగా కనిపిస్తారు. ఆ దివ్యరూపాన్ని గుర్తుచేస్తూ శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. భక్తుల కష్టాలను తొలగించి రక్షించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని స్వామివారు ఈ అలంకారం ద్వారా సందేశం ఇస్తున్నారని పండితులు తెలిపారు. వటపత్రశాయి మహిమను అన్నమయ్య తన సంకీర్తనల్లో కూడా విశేషంగా వర్ణించారు.ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, అధికారులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీ సీతా రాముల కల్యాణానికి తిరుమల శ్రీవారి లడ్డూలు సిద్ధం

**85 వేల లడ్డూల ప్యాకింగ్‌లో పాల్గొన్న 300 మంది శ్రీవారి సేవకులు**



తిరుమల(ప్రశ్న న్యూస్ ) ఏప్రిల్ 01వ తారీఖున ఎంతో ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూలు సిద్ధమయ్యాయి.తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ – 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్‌ను ఆదివారం టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది.ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి డిప్యూటీ ఈవో (పరకామణి ఇన్‌ఛార్జ్) శ్రీ వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1 గంట వరకు నిరంతరాయంగా సాగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడు, ఈవో ఎం. రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు సుమారు 200 మంది మహిళా సేవకులు, 100 మంది పురుష సేవకులు కలిసి ఐదు గంటలపాటు అంకితభావంతో సేవలందించారని తెలిపారు. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ శ్రీవారి సేవా సదన్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఆశయాలే మా దిశ -అమరావతి అజేయం, శాశ్వతం

**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**
**తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలకు ఘన సన్మానం**



నందిగామ(ప్రశ్న న్యూస్) పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని బాబు జగజీవన్ రామ్ బిల్డింగ్‌లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన పార్టీగా నిలిచిందన్నారు. నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ సామాన్యులను చట్టసభలకు పంపించి ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చిందని పేర్కొన్నారు.పేదవాడికి పట్టెడన్నం పెట్టి అతడు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ పనిచేశారని, అదే స్ఫూర్తితో పార్టీ ఇప్పటికీ ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచిన తెలుగుదేశం పార్టీ మహిళలకు స్థానిక సంస్థల్లో ముందుగానే రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి పునాది వేసిందని తెలిపారు. అమరావతి రాజధాని విషయంపై మాట్లాడుతూ, మూడు రాజధానుల భావనకు ఇక ముగింపు పలుకుతూ ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. అమరావతి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు,లాల్ బహుదూర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు, కౌన్సిలర్లు, గ్రామ వార్డు తెదేపా నేతలు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## వేద మంత్రాల మధ్య ఘనంగా శ్రీ పట్టాభిరామస్వామి కల్యాణం

**గరుడవాహనంపై విహరించిన జగదభిరాముడు**

వాల్మీకిపురం (ప్రశ్న న్యూస్) శ్రీ పట్టాభిరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య ఈ దివ్య కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు పుణ్యాహవచనం, సద్యో అంకురార్పణ, రక్షాబంధనం, విశేషారాధన నిర్వహించారు. అనంతరం అగ్నిప్రతిష్ఠ, మధుపర్కం, కన్యాదానం, మహాసంకల్పం, స్వామివారు మరియు అమ్మవారికి ప్రవరలు, మాంగళ్యపూజ కార్యక్రమాలు చేపట్టారు. తదుపరి మాంగళ్యధారణ, ఉపయుక్త హోమాలు, పూర్ణాహుతి, నివేదన, అక్షతారోహణం, ముత్యాల తలంబ్రాల సమర్పణ, మాలమార్పిడి, హారతులు, చతుర్వేద పారాయణం, యజమానులకు వేదాశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. కళ్యాణోత్సవం అనంతరం రాత్రి 11 గంటలకు స్వామివారు గరుడవాహనంపై జగదభిరాముడిగా విహరించి భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఆదివారం ఉదయం 8 గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనం తదితరాలతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, కంకణ బట్టర్ కృష్ణప్రసాద్ బట్టర్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు నాగరాజు, కృష్ణమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మార్చి 30న రథోత్సవం**

వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ పట్టాభిరామస్వామివారు రథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 9.10 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. అలాగే ఏప్రిల్ 1న ఉదయం 11.30 గంటలకు చక్రస్నానం, ఏప్రిల్ 2న సాయంత్రం 5.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.



## తెలుగువారి ఆత్మగౌరవ నినాదం 'తెలుగుదేశం'

**పలాసలో రెపరెపలాడిన పసుపు జెండా**
**టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే గౌతు శిరీష.**
**పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు సాగిన ప్రస్థానాన్ని, మూడు తరాల నాయకత్వాన్ని స్మరించుకున్న నేతలు.**
**సీనియర్ కార్యకర్తలకు ఘన సన్మానం.**



పలాస (ప్రశ్న న్యూస్ ) కాశీబుగ్గ తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం పలాస నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో అత్యంత ఘనంగా జరిగింది.

ఈ వేడుకల్లో భాగంగా, తొలుత స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గౌతు శిరీష పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం, అక్కడి నుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి కాశీబుగ్గలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని, స్వర్గీయ నందమూరి తారక రామారావు కి ఘనంగా నివాళులు అర్పించారు. అక్కడ మరోసారి పసుపు జెండాను ఎగురవేసి, ఎన్టీఆర్ ఆశయాలను స్మరించుకున్నారు. తదనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో, పార్టీ ఆవిర్భావం నుండి పనిచేస్తున్న సీనియర్ నాయకులను, పార్టీ కోసం కష్టపడుతున్న యువకులను ఎమ్మెల్యే గౌతు శిరీష, సీనియర్ నాయకులు దుశ్శాలువాలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గౌతు శిరీష తన ప్రసంగంతో అందరినీ ఉత్తేజపరిచారు.ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును అద్భుతంగా ఆవిష్కరించింది. గౌతు శిరీష నాయకత్వంలో పలాస నియోజకవర్గంలో పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందనే నమ్మకాన్ని కార్యకర్తల్లో నిలిచింది

## అంగన్వాడీలలో చిన్నారులకు 'తొలిముద్ద' పథకానికి ప్రజా ప్రభుత్వం శ్రీకారం అభినందనీయం

**– బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు : కొట్టెపల్లి సుధాకర్**
**– అంగన్వాడీలలో చిన్నారులకు 'తొలిముద్ద' ప్రారంభం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రంలోని అంగన్వాడీ చిన్నారులకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ "తొలి ముద్ద"పథకానికి ప్రజా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో శ్రీకారం చుట్టడం అభినందనీయమని బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ప్రథకం ద్వారా పిల్లలకు రెడీ టూ కుక్ ఫుడ్( ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనున్నారని,అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్ ఈ పథకాన్ని ప్రారంభించడం ప్రశంసనీయమన్నారు. 'ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుంది. పౌష్టికాహారం లేకపోవడం వల్లే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అందుకే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది' అని సుధాకర్ పేర్కొంటూ,సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి యావత్ రాష్ట్ర ప్రజల, చిన్నారుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తల్లిదండ్రుల సంరక్షణ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం

**సత్యనారాయణ గుండ్లపల్లి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ శాసనసభలో తల్లిదండ్రుల సంరక్షణ చట్టం -2026' ను ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి టి పి సి సి లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్, సీనియర్ న్యాయవాది సత్యనారాయణ గుండ్లపల్లి హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు.వృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమాన్ని విస్మరించే ధోరణికి అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అత్యంత సాహసోపేతమైనది, మానవీయ విలువలతో కూడుకున్నదని వారు కొనియాడారు.

**బిల్లులో ముఖ్యాంశాలు..**

జీతంలో 10% కోత.. ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, వారి నెలసరి జీతంలో 10 శాతం నిధులను నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసేలా చట్టపరమైన వెసులుబాటు కల్పించడం వృద్ధులకు ఒక గొప్ప భరోసా అని పేర్కొన్నారు.

**వృద్ధాప్యంలో ఆత్మగౌరవం..**

పిల్లలు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నప్పటికీ, ఆదరణ కరువైన ఎంతోమంది తల్లిదండ్రులకు ఈ చట్టం ద్వారా ఆర్థిక భద్రతతో పాటు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు.

**జవాబుదారీతనం..**

ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి కన్నవారిని విస్మరించడం సామాజిక నేరమని, బాధ్యత గల వ్యక్తులు తమ కుటుంబం పట్ల కూడా అంతే బాధ్యతగా ఉండాలని ఈ బిల్లు స్పష్టం చేస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఈ ప్రజా ప్రభుత్వం కుటుంబ విలువలను కాపాడటంలో దేశానికే ఒక మార్గదర్శిగా నిలిచిందని సత్యనారాయణ గుండ్లపల్లి ఈ సందర్భంగా తెలిపారు. ఈ విప్లవాత్మక చట్టం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు అయ్యేలా చూడాలని, ఇది వృద్ధుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు

## వార్డు సభ్యుల సమస్యల పరిష్కార దిశగా నేడు కీలక సమావేశం

**– ఉమ్మడి జిల్లాల వార్డు సభ్యులకు హాజరు కావాలని పిలుపు**
**– రాష్ట్ర అధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వార్డు సభ్యుల సమస్యల పరిష్కార దిశగా నేడు సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వార్డు సభ్యులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.వారి వెంట రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అమ్మిగల్ల గోపాల్, రాష్ట్ర నాయకులు బత్తిని అనిల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# శిల్ప కళాకారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

**100 కోట్ల రూపాయలతో రామప్ప దేవాలయాన్ని అభివృద్ధి చేయాలి**



తార్నాక(ప్రశ్న న్యూస్) శిల్పాలను శిల్ప తోరణాలను అద్భుతంగా తొలచి అనేక దేవాలయాలు ప్రతిష్టకు శిల్ప కళాకారులు నిలిచారని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కొనియాడారు. అలాంటి శిల్పకారుల పరిస్థితి దయనీయంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వాలు స్పందించి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ రామప్ప దేవాలయాన్ని గణేష్ చారి సందర్శించారు. ఈ సందర్భంగా కళా నైపుణ్యాన్ని కళాకారుల కృషిని వివరిస్తూ ఇలాంటి శిల్ప కళలు ఎక్కడ చూడలేదన్నారు. తాజ్మహల్, అయోధ్య, తిరుమల తిరుపతి, వారణాసి ఇలా అనేక దేవాలయాలు కళాకారులతో ఏర్పాటు చేసిన కళా అద్భుతమని రాబోయే తరాలకు ఇది గొప్ప కానుకగా నిలుస్తుందని తెలిపారు. రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 100 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోదండ రాములు, శ్రీహర్ష, ప్రభావతి, ప్రవంతి, విజయలక్ష్మి, కౌశల్, నరసింహా చారి తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మరొకసారి పునరాలోచించాలి



తార్నాక(ప్రశ్న న్యూస్) క్రైస్తవంలోకి మారిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించదు అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పై దళిత క్రైస్తవ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ గడ్డం అశోక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ దళిత క్రైస్తవ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రిజర్వేషన్ల లక్ష్యం మత గుర్తింపు కాదని సామాజిక, ఆర్థిక స్థితిగతులేనని అన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కావాలని కేసులు వేసి ఎన్నో ఏళ్లుగా సుప్రీంకోర్టులో పోరాడుతున్నామని అన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలా లేదా అనే దాని మీద కే.జీ. బాలకిషన్ కమిటీ, గతంలో రంగనాథ్ మిశ్రా కమిషన్ లాంటివి ఎన్నో వేయడం జరిగిందన్నారు. న్యాయ నిపుణులతోని సమీక్ష చేయకుండా, పబ్లిక్ ఒపీనియన్ తీసుకోకుండా గుంటూరు పాస్టర్ వేసిన కేసును ఆధారంగా తీసుకొని క్రైస్తవంలోకి మారిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో క్రైస్తవులు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. దేశంలో మత స్వేచ్ఛ ఉందని ఏ మతాన్ని అయినా స్వీకరించే హక్కు ప్రజలకు ఉందని రాజ్యాంగం లోని ఆర్టికల్ 14, 15 స్పష్టం చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై త్వరలో రిట్ పిటిషన్ వేస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మరొకసారి పునరాలోచించాలని కోర్టును విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బంధు సొసైటీ అధ్యక్షుడు మల్లెల వీరస్వామి, లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బాలాజీ, శ్రీనివాస్, బాలకృష్ణ, క్రైస్తవ నాయకులు జెరూసలేం మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జండా కార్యక్రమం నిర్వహించినటువంటి పాలేరు నియోజకవర్గం ఇన్చార్జి రేగు బాలనర్సయ్య. కార్యక్రమంలో మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవ పేరిట తెలుగుదేశం పార్టీని స్థాపించి అనతి కాలంలోనే అధికారంలోకి వచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చరిత్ర సృష్టించినటువంటి పార్టీ తెలుగుదేశం పార్టీ అని, అన్న నందమూరి తారక రామారావు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి నేటికీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడని, నారా చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజల అభివృద్ధి కోసం తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం నిరంతరము శ్రమించే గొప్ప నాయకుడని కొనియాడాడు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మచ్చ నరసింహా గౌడ్ పట్టణ శాఖ అధ్యక్షుడు చిత్తర్ల శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి ముకర్ల శ్రీశైలం యాదవ్ తెలుగుదేశం పార్టీ నాయకులు శివరాత్రి కిష్టయ్య దుర్గపతి కృష్ణ సీసా రాజకుమార్ గౌడ్ శివరాత్రి యాదగిరి నాగరాజు రాళ్ల బండి రాజు చారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని దర్శించుకున్న

# మెదక్ జిల్లా కలెక్టర్ దంపతులు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మంజీరా నదీ తీరాన వెలసిన అత్యంత మహిమాన్విత క్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం. కలెక్టర్భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం వన దుర్గ భవాని మాతఆ దుర్గామాత ఆశీస్సులతో జిల్లాలో ప్రజలందరూ అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలి.కలెక్టర్ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఆలయ కార్యనిర్వాహణాధికారి, అర్చకులు, ఏడుపాయల వన దుర్గ భవాని మాతనుదర్శించుకున్న జిల్లా కలెక్టర్ దంపతులుమంజీరా నదీ తీరాన వెలసిన అత్యంత మహిమాన్విత క్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం అని.భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం వన దుర్గ భవాని మాత అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు ఏడుపాయల దుర్గామాతను మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. ఆలయ ఈవో వీరేశం, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారి పేర ప్రత్యేక పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లాలో ఏడుపాయల దుర్గా భవానీ దేవత యొక్క అత్యంత గౌరవనీయమైన మందిరంగా పేర్కొన్నారు . కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతూ ఈ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు.మామూలు రోజుల్లో ఒక మాదిరిగా ఉండే భక్తుల రద్దీ ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు తాకిడికనుగుణంగా సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా భక్తులకు సౌకర్యాలు ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రతంగా ఉంచడంలో నిర్వాహకుల సేవలను కలెక్టర్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఈవో వీరేశం సిబ్బంది శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

## ఆదివారం భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ఆలయానికి విచ్చేశారు.దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం,ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంట సమయం పడుతుంది.ఆర్జిత సేవలు,నిత్యా పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్నారు భక్తులు.రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.నిత్యా కల్యాణం,లడ్డు ప్రసాదం కౌంటర్లు,సత్యనారాయణ స్వామి వ్రత మండపం,కొండక్రింద కల్యాణ కట్ట,పుష్కరిణి,వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.

# లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) ఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహుడికి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రధానాలయం లోని ముఖమండపంలో నయన మనోహరంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు వేద మంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ సహస్రనామాలతో లక్ష పుష్పార్చన అత్యంత వైభవంగా చేపట్టారు.వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన కన్నుల పండుగగా చేపట్టారు.లక్ష పుష్పార్చన విశిష్టతను భక్తులకు తెలియజేసారు ఆలయ అర్చకులు.లక్ష పుష్పార్చనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు భక్తులు.పూజలో ఆలయ ఈఓ భవాని శంకర్ పాల్గొన్నారు.

## మరోసారి మానవత్వాన్ని చాటుకున్న

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**- అత్యవసర చికిత్సకు రూ.5 లక్షల**

**ఎల్.ఓ.సీ. మంజూరుకు ఆది శ్రీనివాస్**



వేములవాడ (ప్రశ్న న్యూస్ ) వేములవాడ నియోజకవర్గం, కొనరావుపేట మండలం, కొండాపూర్ గ్రామానికి చెందిన అనుముల బాలవ్వ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర చికిత్స అవసరమని తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించారు.బాలవ్వకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రభుత్వం తరఫున రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.ఇదే సమయంలో మండేపల్లి గ్రామానికి చెందిన బేబీ అనే బాధితురాలికి కూడా రూ.2.50 లక్షల విలువ గల ఎల్ఓసీ మంజూరు చేయించి, మొత్తం రూ.5 లక్షల వైద్య సహాయాన్ని ఒకే రోజులో అందేలా కృషి చేసి, విప్ ఆది మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చూపిన ఈ తక్షణ స్పందనపై బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పోతాంశెట్టిపల్లిలో 31 నుండి పెద్దమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవాలు

**ప్రముఖులను ఆహ్వానించిన ముదిరాజ్ సంఘం నేతలు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఈనెల 31 నుండి కొల్చారం మండలం పోతాంశెట్టిపల్లి గ్రామంలోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు జరగనున్నాయని ముదిరాజ్ సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఆలయ కమిటీ నాయకులు దుర్గేష్, బ్రహ్మం, శ్రీనివాస్, పెంటయ్య, ఏగొండ తదితరులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావును, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ను సీనియర్ కాంగ్రెస్ నేత మ్యాడం బాలకృష్ణను ఈ ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆదివారం నాడు వారు ఆహ్వాన పత్రికను ప్రముఖులకు అందజేశారు. ఈ ఉత్సవాలు ఈనెల 31 నుండి వచ్చేనెల రెండవ తేదీ వరకు జరగనున్నాయన్నారు. భక్తులు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలి

**వైయస్సార్సీపి ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి**



వైయస్సార్ జిల్లా (ప్రశ్న న్యూస్) కమలాపురం మండలం సంబటూరు గ్రామంలో నిర్వహించిన గంగమ్మ జాతరలో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కమలాపురం మండలం సంబటూరు గ్రామంలో జరుగుతున్న జాతరలో ఆయన పాల్గొన్నారు. సంభటూరు గ్రామానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి వైఎస్ఆర్ సిపి రైతు విభాగం వైఎస్ఆర్ జిల్లా కన్వీనర్ సంబటూరు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ స్వాగతం పలికి, ఆయన చేత గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహింప చేసి తీర్థ ప్రసాదాలు అందించి దుస్సాలువతో సత్కరించారు.

# శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో వైభవంగా శ్రీరామపట్టాభిషేకం



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరిగింది.ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులను ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం నరసింహతీర్థం నుండి తెచ్చిన తీర్థంతో శ్రీకోదండరామునికి అభిషేకం చేశారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు యాగశాలలో అగ్నిప్రతిష్ట, చతుర్దశ కలశస్నపన తిరుమంజనం నిర్వహించారు.రాత్రి 7 గంటల నుండి శ్రీరామపట్టాభిషేకం వైభవంగా జరిగింది. రాత్రి 8.30 నుండి 9.30 గంటల వరకు బంగారు తిరుచ్చిపై శ్రీ సీతారామలక్ష్మణులు, ప్రత్యేక తిరుచ్చిపై శ్రీఆంజనేయస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




# 'ధురంధర్' క్రేజ్

## - 30 ఏళ్ల నాటి నటుడిని ఎలా కనిపెట్టారంటే..!

ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తున్న 'ధురంధర్: ది రివెంజ్' సినిమాపై క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. సినిమా భారీ విజయం సాధించడమే కాకుండా, అందులోని చిన్న చిన్న వివరాలపై కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా, ఓ కీలక పాత్ర పోషించిన నటుడి గురించి నెటిజన్లు చేస్తున్న ఓ విశ్లేషణ ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ చిత్రంలో బలూచిస్తాన్ యునైటెడ్ ఫోర్స్ నాయకుడిగా 'షిరానీ' అనే పాత్రలో కనిపించిన నటుడు ఎవరా అని నెటిజన్లు ఆరా తీశారు. అతను 30 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నటుడు బిమల్ ఒబెరాయ్ అని, గతంలో దలేర్ మెహందీ పాపులర్ సాంగ్ 'హో జాయేగీ బల్లే బల్లే'లో కనిపించారని ఒక యూజర్ ఎక్స్ లో పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ కావడంతో, స్పై సినిమాపైనే నెటిజన్లు స్పైయింగ్ చేస్తున్నారంటూ కామెంట్లు వెల్లువెత్తాయి.ఆదిత్య ధర్ దర్శకత్వంలో, రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన ఈ చిత్రం పాన్-ఇండియా స్థాయిలో అద్భుతమైన స్పందనతో భారీ వసూళ్లను రాబడుతోంది. ఆయుష్మాన్ ఖురానా, అనుపమ్ ఖేర్ వంటి ప్రముఖులు సినిమాపై ప్రశంసలు కురిపించారు. అయితే, ఈ చిత్రం ప్రభుత్వ అనుకూల ప్రచార చిత్రమని కొందరు విమర్శిస్తున్నారు. ఈ వాదనలు ఎలా ఉన్నా, 'ధురంధర్' ఫ్రాంచైజీ మాత్రం ఆధునిక బాలీవుడ్ సినిమాలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.



# నిజమైన సూపర్‌హీరోస్ వాళ్లే

నచ్చిన పని చేస్తూ, లక్ష్యాన్ని సాధించడంలోనే విజయం ఉందని చాలామంది అంటూవుంటారు. కానీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా అసలు 'విజయం' అనే కాన్సెప్ట్‌కే కొత్త అర్థం చెప్పారు. ఆ ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడుతూ 'నచ్చిన పని చేసే అవకాశం అందరికీ దొరకదు. ఈ ప్రపంచంలో ఇష్టంలేని పనిచేస్తూ బ్రతుకుతున్నవాళ్లే ఎక్కువ. బాధ్యతలు మనిషిని కఠినంగా మారుస్తాయి. మనసు చంపుకునేలా చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లోనూ ముఖంపై చెరగని చిరునవ్వుతో ఉంటారే.. వాళ్లు నిజమైన సూపర్‌హీరోస్. అలాంటి వారు పడే కష్టం. వారు చూపే అంకితభావం నా దృష్టిలో గొప్ప విజయం. కేవలం ఇష్టమైన పనులు చేస్తూ లక్ష్యాన్ని సాధించేవారే విజేతలు కాదు. ఇష్టాయిష్టాలను పక్కనపెట్టి బాధ్యతల కోసం ముందుకు సాగే వారు కూడా విజేతలే' అంటూ చెప్పుకొచ్చారు ప్రియాంక చోప్రా. ఇప్పుడీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# 'విశ్వంభర' నుంచి డబుల్ ట్రీట్ రెడీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభర కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ చిత్రం మొదటి నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. అయితే వీఎఫ్ఎక్స్ పనుల్లో జాప్యం కారణంగా ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. తాజా సమాచారం ప్రకారం, 'విశ్వంభర' నిర్మాణ పనులు ఇప్పుడు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ అభిమానులకు డబుల్ సర్ప్రైజ్ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ ట్రైలర్‌ను విడుదల చేయడమే కాకుండా, అదే సమయంలో కొత్త రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా శ్రీరామనవమి సందర్భంగా ఈ అప్‌డేట్ ఇవ్వాలని భావించినప్పటికీ, అదే సమయంలో ఇతర భారీ చిత్రాల అప్‌డేట్లు ఉండటంతో చిత్ర యూనిట్ తమ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు సమాచారం. అయితే త్వరలోనే భారీ స్థాయిలో ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. అందాల భామ త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, రాబోయే ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే ఈ అంచనాలు మరింత రెట్టింపు అవుతాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానంగా ఉండే ఈ సోషియో ఫాంటసీ చిత్రంలో చిరంజీవి మరోసారి కొత్త లుక్, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం. కాగా 'విశ్వంభర' నుంచి రాబోయే ట్రైలర్ మరియు రిలీజ్ డేట్ ప్రకటనపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మెగాస్టార్ నుంచి ఈ డబుల్ ట్రీట్ ఎప్పుడు వస్తుందా అని మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# థియేటర్లలో తగ్గిన 'ఉస్తాద్ భగత్ సింగ్' హవా..

## - ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధం



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు ముందే భారీ అంచనాలు సొంతం చేసుకుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత ఈ కాంబినేషన్‌లో వచ్చిన సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అందాల తారలు శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటించడంతో సినిమాకు మంచి క్రేజ్ వచ్చింది. మార్చి 19న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద అనుకున్న స్థాయిలో కలెక్షన్లు రాలేకపోయాయి. దీనికి ప్రధాన కారణంగా అదే సమయంలో విడుదలైన ధురంధర్ 2 చిత్రం. ఈ మూవీ భారీ విజయం నమోదు చేస్తున్న క్రమంలో ఉస్తాద్ భగత్ సింగ్ హవా తగ్గింది. ధురంధర్ 2 సినిమా సృష్టిస్తున్న రికార్డుల దూకుడు మధ్య 'ఉస్తాద్ భగత్ సింగ్' తన థియేట్రికల్ రన్‌లో పూర్తి స్థాయిలో రాణించలేకపోయింది. ఈ పరిస్థితుల్లో మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సినిమాను త్వరగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ఇప్పటికే సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'ఉస్తాద్ భగత్ సింగ్'ను ఏప్రిల్ 24న ఓటీటీలో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయిన ఈ సినిమా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో మంచి రెస్పాన్స్ సాధిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం థియేటర్లలో ఎదుర్కొన్న సవాళ్ల తర్వాత, ఇప్పుడు ఓటీటీలో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. పవన్ కళ్యాణ్ అభిమానులు ఈ సినిమాను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ఎలా ఆదరిస్తారో చూడాలి. కాగా, పవన్ కళ్యాణ్ చివరి చిత్రం ఓజీ బాక్సాఫీస్ దగ్గర ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

# ప్రేమకథా సినిమాలకు

## దూరంగా పెరిగానన్న అమీర్ ఖాన్



బాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలతో "మిస్టర్ పర్ఫెక్ట్"గా పేరు తెచ్చుకున్న అమీర్ ఖాన్ తాజాగా తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. వెండితెరపై ఎన్నో రొమాంటిక్, భావోద్వేగ కథల్లో నటించిన ఆయన, నిజ జీవితంలో మాత్రం చాలా కట్టుబాట్ల మధ్య పెరిగినట్లు తెలిపారు. తన కుటుంబం చాలా సంప్రదాయబద్ధంగా ఉండేదని, చిన్నప్పటి రోజుల్లో సినిమాలు చూసే విషయంలో కూడా కఠిన నియమాలు ఉండేవని అమీర్ చెప్పారు. ముఖ్యంగా ప్రేమకథా చిత్రాలు చూడటానికి ఇంట్లో అనుమతి ఉండేది కాదని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పట్లో పెద్దలు సినిమాలు పిల్లల మనస్తత్వంపై ప్రభావం చూపుతాయని భావించి ఇలాంటి నియంత్రణలు విధించేవారని పేర్కొన్నారు. అయితే, ఈ పరిమితులు తనలోని సినిమా పట్ల ఆసక్తిని తగ్గించలేకపోయాయని అమీర్ అన్నారు. కుటుంబ విలువలను గౌరవిస్తూ, మరోవైపు కళపై ఉన్న మక్కువను పెంచుకుంటూ ముందుకు సాగానని చెప్పారు. ఈ క్రమంలోనే తన సినిమాల్లో కథకు ప్రాధాన్యం, సామాజిక బాధ్యత వంటి అంశాలు ఉండేలా చూసుకోవడంలో ఈ పెంపకం ప్రభావం చూపిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత డిజిటల్ యుగంతో పోలిస్తే అప్పటి పరిస్థితులు చాలా భిన్నంగా ఉండేవని అమీర్ వివరించారు. నేటి తరానికి అన్ని రకాల కంటెంట్ సులభంగా అందుబాటులో ఉన్నప్పటికీ, అప్పట్లో కుటుంబం విధించిన నియమాలు క్రమశిక్షణను నేర్పేవని అన్నారు. ఇదిలా ఉంటే, తన కెరీర్‌లో ఎన్నో ప్రేమకథా చిత్రాల్లో నటించినప్పటికీ, వ్యక్తిగత జీవితంలో మాత్రం అలాంటి సినిమాలకు దూరంగా పెరగడం విశేషమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అమీర్ ఖాన్ తన తదుపరి ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అలాగే తన కుమారుడు జునైద్ ఖాన్ సినీ కెరీర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అతనికి సంబంధించిన పనులను కూడా స్వయంగా చూసుకుంటున్నారు. ఇటీవల, ప్రముఖ గాయకుడు అర్జిత్ సింగ్‌తో తన కుమారుడి సినిమా కోసం పాట పాడించేందుకు అమీర్ స్వయంగా అతని స్వగ్రామానికి వెళ్లి ఒప్పించినట్లు సమాచారం. ఇది ఆయన తన పనిపై చూపించే నిబద్ధతకు మరో నిదర్శనంగా మారింది.

# అందాల చిచ్చుబుడ్డి



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న క్రైమ్ డ్రామా 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ నేపథ్యంలో శనివారం ఈ సినిమా నుంచి రెండో పాట 'చిచ్చు బుడ్డి'ని విడుదల చేశారు. ఇందులో అడివి శేష్ డ్యాన్స్‌తో అదరగొడుతూ హైఎనర్జీతో కనిపించారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో జానపద శైలి బీట్‌తో ఈ పాటను కంపోజ్ చేశారు. భాస్కరభట్ల సాహిత్యం ఆకట్టుకునేలా ఉంది. మాజీ ప్రేమికుల నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిదని, ప్రేమకథ హార్ట్‌టచింగ్‌గా ఉంటుందని దర్శకుడు తెలిపారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు.

## రాంపల్లి విలేజ్ లో ఉచిత మెగా వైద్య శిబిరం




నాగారం (ప్రశ్న న్యూస్) రాంపల్లి విలేజి, ఎస్ సి కాలనీ, అంగన్ వాడి స్కూల్ ప్రాంగణం లో నిర్వహించారు. కమలానగర్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్, కీసర సీ ఐ టి యు మండల కమిటీలు కలిసి ఏర్పాటు చేసిన కాంప్ ని ప్రారంభించిన సిఐ టియు కీసర మండల కార్యదర్శి బంగారు. నర్సింగరావు మాట్లాడుతూ ఈరోజుల్లో వైద్యం చాలా ఖరీదు అయిందని ,పేదల కోసం బస్తీలలో శిబిరం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామన్నారు .నిరుపేదలకు కళ్ళకు కాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితం గానే చేయిస్తున్నట్లు తెలిపారు .ఉచిత సేవలకు సహకరిస్తున్న ట్రస్ట్, శ్రీకర హాస్పిటల్ వారికీ ధన్యవాదాలు తెలిపారు.కాంప్ లో కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ అనిల్ కుమార్ బృందం కళ్ళ పరీక్షలు చేశారు.దమ్మాయిగూడ సాకేత్ –పద్మ సాయి డెంటల్ క్లినిక్స్ డాక్టర్ దినేష్ నమిలే బృందం దంతాల పరీక్షలు ,కమలానగర్ శ్రీకర హాస్పటల్ డాక్టర్ల బృందం బీపీ ,షుగర్, జనరల్ పరీక్షలు తోపాటు ఆర్థో ,న్యూరో ,ఈసీజీ పరీక్షలు చేశారు. నాగారం కుమారి వెల్నెస్ ప్రోగ్రాం చేశారు .143 మంది పాల్గొని అన్నిరకాల వైద్య పరీక్షలు చెయించుకున్నారు .ట్రస్ట్ తరపున ఉచితంగా రోగులకు మందులు పంపిణి చేశారు.ప్రోగ్రాంలో ట్రస్ట్ చైర్మన్ సిహెచ్ .వరప్రసాద్ ట్రస్ట్ నాయకులు జీవీ రావు ,పురుషోత్తం రెడ్డి ,శ్రీమతి సంతోషి, సిఐ టియు కీసర మండల నాయకులు చింతకింది అశోక్ ,కాంప్ కోఆర్డినేటర్ సునీల్ కుమార్, ఆంజనేయులు, శ్రీనివాస్, శ్రావణ్, నరసింహ ,నవీన్ ,రాములు, రమేష్, ఆండాలు ,మల్లమ్మ, అరుణ, సుజాత, సవిత ,శ్రీ వేణి ,సునీత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎల్ బెట్టింగ్‌లపై కఠిన హెచ్చరిక

**- బెట్టింగ్ చేస్తే జైలే..!- సమాచారం ఇవ్వాలని ఎస్సై జె. రమేష్ పిలుపు**



చందుర్తి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, చందుర్తి సబ్ ఇన్స్పెక్టర్ జె. రమేష్ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో బెట్టింగ్‌లపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని చందుర్తి ఎస్సై జె. రమేష్ హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్‌లు ఆర్థికంగా తీవ్ర నష్టాలకు దారితీస్తాయని, కుటుంబాలు ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు.మండల పరిధిలో ఎవరైనా బెట్టింగ్‌లు నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మీ ప్రాంతంలో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 100 డయల్ చేయాలని లేదా 87126 56420 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చిన ఎస్సై రమేష్, ముఖ్యంగా యువత ఆశకు లోనై బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, కష్టపడి సంపాదించిన డబ్బును వృథా చేసుకోకూడదని విజ్ఞప్తి చేశారు.

## గడ్డం లక్ష్మణ్ నాయకత్వంలో బార్ అసోసియేషన్ మరింత అభివృద్ధి

**-కరీంనగర్ రెండో జిల్లా స్పెషల్ కోర్టు గవర్నమెంట్ ప్లీడర్ : జనగామ నరేష్**

**- బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి జనగామ నరేష్ ఘన సన్మానం-శుభాకాంక్షలు**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ బార్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది గడ్డం లక్ష్మణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ రెండో జిల్లా కోర్టు స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్ జనగామ నరేష్ నూతన అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్‌ను శాలువాతో శనివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జనగామ నరేష్ మాట్లాడుతూ, గడ్డం లక్ష్మణ్‌కు న్యాయవృత్తిలో ఉన్న విశేష అనుభవం బార్ అసోసియేషన్ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆయన నాయకత్వంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కారమవడంతో పాటు బార్ అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొని, గడ్డం లక్ష్మణ్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి





నాచారం(ప్రశ్న న్యూస్) ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు 25% సీట్లు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు మింద్రాల నర్సింగ్ రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 ఆగస్టు 27న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి విద్యా హక్కు చట్టం అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు పరచడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. దీంతో పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు తగ్గుతున్నాయన్నారు. విద్యా హక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని నర్సింగ్ రావు డిమాండ్ చేశారు.

# రావల్ కోల్ మాజీ సర్పంచ్‌కు రూ. 15 వేల జరిమాన

**అనుమతి లేకుండా బోరు వేయడంతో వాహనం సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు**

**అనుమతి పత్రాలు చూపలేకపోయిన మాజీ సర్పంచ్**

**అనుమతి లేకుండా బోర్లు వేస్తే క్రిమినల్ చర్యలు : తహసీల్దార్ వీరనాల భూపాల్**






మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ )చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన ఒక మాజీ ప్రజాప్రతినిధి, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పట్టుబడ్డారు. అనుమతి లేకుండా తన ప్లాటులో త్రాగునీటి కోసం బోరు వేస్తున్న రావల్ కోల్ గ్రామ మాజీ సర్పంచ్ రాజబోయిన మహేందర్‌కు రెవెన్యూ అధికారులు గట్టి షాక్ ఇచ్చారు. వాల్టా చట్టం కింద చర్యలు తీసుకుంటూ భారీ జరిమానాతో పాటు బోరు వాహనాన్ని సీజ్ చేశారు.

### అనుమతి పత్రాలు చూపలేకపోయిన మాజీ సర్పంచ్

స్థానిక రెవెన్యూ మరియు పురపాలక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రావల్ కోల్ మాజీ సర్పంచ్ రాజబోయిన మహేందర్ తన సొంత ప్లాటులో బోరు వేయడానికి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా బోరు తవ్వకం జరుగుతుందన్న పక్కా సమాచారంతో జీపీఓ దినేష్ తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని బోరు వేయడానికి సంబంధించిన పత్రాలను కోరగా, మహేందర్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేవని తేలడంతో వెంటనే బోరు నిలిపివేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో పని చేసిన వారు ఇలా నిబంధనలు అతిక్రమించడం చర్చనీయాంశంగా మారింది.

### వాహనం సీజ్.. జరిమానా విధింపు

తెలంగాణ రాష్ట్ర వాల్టా చట్టం ప్రకారం అనుమతి లేకుండా భూగర్భ జలాలను వెలికితీయడం నేరం కావడంతో రెవెన్యూ అధికారులు బోరు తవ్వకానికి ఉపయోగిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, దాని తాళాలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన రాజబోయిన మహేందర్‌కు రూ. 15 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ వీరనాల భూపాల్ తెలిపారు.

### అనుమతి లేకుండా బోర్లు వేస్తే క్రిమినల్ చర్యలు :



తహసీల్దార్ వీరనాల భూపాల్

భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. అనుమతి లేకుండా బోర్లు వేయడం చట్టరీత్యా నేరమని, ఎవరు

# ఇంజాపూర్‌లో భట్రాజు సంఘం అభినందనోత్సవ సన్మాన సభ

**కీర్తి సంతోష్ రాజ్‌కు ఘన సన్మానం**

**పదవి కాదు... సేవే ముఖ్యం..**

**కీర్తి సంతోష్ రాజ్**

**భట్రాజు శక్తి ని తెలంగాణ కు చూపుదాం.. కీర్తి సంతోష్ రాజ్ పిలుపు**





హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌లో భట్రాజు సమాజం మరోసారి తన ఐక్యతను, శక్తిని ఘనంగా ప్రదర్శించింది. తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం ఆధ్వర్యంలో మార్చి 29 ఆదివారం నిర్వహించిన అభినందనోత్సవ సన్మాన కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భట్రాజు సమాజానికి చెందిన ప్రముఖులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘ ఐక్యతను చాటారు.ఈ వేడుకలో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కీర్తి సంతోష్ రాజ్‌ను ఘనంగా సన్మానించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. జర్నలిజం రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఆయన సేవలను కొనియాడుతూ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతికంఠ పూర్ణచందర్ రాజు మాట్లాడుతూ భట్రాజు సమాజానికి సంబంధించిన కార్యక్రమాలను పత్రికల ద్వారా ప్రజలకు చేరవేస్తూ, సంఘ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ కీర్తి సంతోష్ రాజ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇలాంటి వ్యక్తులను సన్మానించడం సంఘానికి గర్వకారణం అని పేర్కొన్నారు. అనంతరం కీర్తి సంతోష్ రాజ్ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సేవ చేయడానికి పదవులు అవసరం లేదు సేవ చేయాలన్న సంకల్పం ఉంటే చాలు, సమాజానికి ఉపయోగపడే ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అదేవిధంగా భట్రాజు సంఘ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సంఘ పెద్దలు అండగా ఉండాలి. ఐక్యతే మన బలం అని సూచించారు.రాబోయే గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి భట్రాజు సమాజం రాజకీయంగా తన శక్తిని నిరూపించుకోవాలి. ఎక్కువ సంఖ్యలో పోటీ చేసి, బంపర్ మెజారిటీతో గెలిచి మన బలం ఏంటో తెలంగాణకు చూపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం భట్రాజు సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, భవిష్యత్ రాజకీయాల్లో సంఘం పాత్రపై స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## వ్యవసాయరంగ కథనాలతో గుర్తింపు తెచ్చుకున్న జర్నలిస్ట్ ప్రసాద్ కు విశిష్ట పురస్కారం

**– మండల ప్రజా ప్రతినిధుల, అధికారుల ప్రశంసలు – శుభాకాంక్షలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలానికి చెందిన ప్రముఖ ఓ దినపత్రిక పాత్రికేయుడు పట్నం ప్రసాద్‌కు “బెస్ట్ అగ్రికల్చర్ జర్నలిస్ట్” అవార్డు లభించింది. రైతుల సమస్యలు, వ్యవసాయ పథకాలు, పంటల పరిస్థితులు, వ్యవసాయ మార్పులు వంటి అంశాలపై ఆయన నిరంతరం సమగ్ర కథనాలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు.ప్రసాద్ సేవలను గుర్తించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్‌లో శనివారం నిర్వహించిన రైతు సదస్సు, అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్‌లో ఆయనకు అవార్డును అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డా. బోగారి హరికృష్ణ, కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డీన్ రాంప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ఆత్మ పీడీ ఛత్రునాయక్, పొలాస సీనియర్ సైంటిస్ట్ సంధ్యాకిషోర్, సిరిసిల్ల కాలేజీ అసోసియేట్ డీన్ సునీత, నర్సింహారెడ్డి, ఏవోలు సురేందర్, పున్నం చందర్ తదితరులు పాల్గొని ప్రసాద్‌ను అభినందించారు.ఈ నేపథ్యంలో బోయినిపల్లి మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు,తదితరులు హర్షం వ్యక్తం చేసి,ప్రశంసిస్తూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

## బెట్టింగ్‌కు అలవాటు పడి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

**బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు,**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) జిల్లాలో ఎవరైనా క్రికెట్ లేదా ఇతర బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ హెచ్చరించారు.ఇటీవల కాలంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత క్రికెట్ బెట్టింగ్ మోజులో పడి తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని తెలిపారు. యువత బెట్టింగ్‌ల వైపు వెళ్లి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా వారు మొబైల్ ఫోన్ వినియోగం, ప్రవర్తనను గమనించాలని, అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వెంటనే స్పందించాలని తెలిపారు.జిల్లాలో బెట్టింగ్‌లను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఆధునిక సాంకేతికతతో పాటు టాస్క్‌ఫోర్స్ మరియు ప్రత్యేక బృందాల సహకారంతో నిఘా పెంచుతున్నామని పేర్కొన్నారు.
జిల్లాలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్‌లపై సమాచారం ఉన్నవారు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100, అలాగే జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# మున్సిపల్ శాఖలో టీడీఆర్‌ల దందా.?

## టీడీఆర్‌ల పేరుతో జోరుగా అక్రమ నిర్మాణాలు

**టీడీఆర్ లు కొని అధిక ధరలకు అమ్ముతున్న బ్రోకర్లు, బిల్డర్లు**

**చిన్న గల్లీలలో కూడా టీడీఆర్ పేర్లతో అంతస్తులపై అంతస్తులు**

**ప్రభుత్వానికి నష్టం చేస్తున్న టీడీఆర్ ల వ్యవహారం**

**(గౌటి రామకృష్ణ - ప్రశ్న న్యూస్)**







గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో టిడిఆర్ ( ట్రాన్స్ఫరెబుల్ డెవలప్మెంట్ రైట్ ) పేరుతో జరుగుతున్న నిర్మాణాల దందా రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. అసలు టిడిఆర్ అంటే ఏమిటి అన్న విషయాన్ని చాలామంది సాధారణ ప్రజలకు స్పష్టంగా తెలియకపోవడంతో అదే పరిస్థితిని కొందరు దుర్వినియోగం చేసుకునేలా మారింది. టిడిఆర్ అనేది ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం భూమి ఇచ్చిన యజమానులకు పరిహారంగా ఇచ్చే అభివృద్ధి హక్కులు. అంటే తమ భూమిని రోడ్లు, ఫ్లైఓవర్లు వంటి ప్రజా ప్రయోజనాల కోసం ఇచ్చిన వారికి ఆ భూమి విలువకు సమానంగా అదనపు నిర్మాణ హక్కులు ఇవ్వడం జరుగుతుంది. అయితే ఈ వ్యవస్థను అసలు ఉద్దేశానికి విరుద్ధంగా ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. టిడిఆర్ పేరుతో చిన్న చిన్న గల్లీల్లో కూడా అనుమతులకు మించి అంతస్తులపై అంతస్తులు నిర్మించడం విస్తృతంగా జరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అనేక ప్రాంతాల్లో బిల్డర్లు టిడిఆర్ సర్టిఫికేట్లు చూపిస్తూ భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ వాటికి సంబంధించిన అసలు పత్రాలు ఎక్కడ.? అనుమతులు సరైనవేనా.? ఇన్ని టిడిఆర్ లు ఎక్కడినుండి వస్తున్నాయి.? నగరంలో ఎన్ని నిర్మాణాలను ప్రభుత్వం కూల్చివేస్తుంది.?ఎన్ని నిర్మాణాలకు టిడిఆర్ లు జారీ చేస్తున్నారు.? మున్సిపల్ శాఖ దగ్గర పూర్తిస్థాయిలో డేటా ఉందా.? అనే అనేక అనుమానాలు ప్రజలలో వ్యక్తం అవుతున్నాయి. టిడిఆర్ ల విషయంలో పారదర్శకత లేకపోవడం ప్రజల్లో అనేక అనుమానాలకు దారితీస్తోంది. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ విషయంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులే, "టిడిఆర్ ఉంది" అనే ఒక మాటతో బాధ్యత తప్పించుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిడిఆర్ ఉందా? ఉంటే ఎంత మేరకు వినియోగించుకోవచ్చు.? రిజిస్టర్ అయ్యిందా.? అనే వివరాలు ప్రజలకు తెలియజేయకుండా గుర్తుచప్పుడు కాకుండా నిర్మాణాలు కొనసాగడం పెద్ద సమస్యగా మారింది.ఇక మరోవైపు టిడిఆర్ వ్యవహారం కోట్ల రూపాయల వ్యాపారంగా మారిందని తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో కొందరు మధ్యవర్తులు, బిల్డర్లు కలిసి టిడిఆర్ సర్టిఫికేట్లను కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు విక్రయిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా తగ్గిపోతున్నదని నిపుణులు చెబుతున్నారు.

ప్రజలు మాత్రం టిడిఆర్ ల పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్న వీధుల్లో భారీ నిర్మాణాలు పెరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ సమస్యలు, నీటి సరఫరా, డ్రైనేజ్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్ నగరం అక్రమ నిర్మాణాలతో అస్తవ్యస్తంగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో మున్సిపల్ శాఖలో టిడిఆర్ విధానంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

టిడిఆర్ వినియోగంపై కఠిన నిబంధనలు అమలు చేయడం, ప్రతి నిర్మాణానికి సంబంధించిన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యమని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. లేదంటే ప్రభుత్వం టిడిఆర్ ను మంచి ఉద్దేశంతో తీసుకొచ్చిన విధానం, నగర అభివృద్ధికి కాకుండా అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని భవిష్యత్తులో దీనితో పెను ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# గోల్డ్ మ్యాన్ కాదు..

# రోల్డ్ గోల్డ్ మ్యాన్

**- నకిలీ వెలుగులు.. అసలు నిజాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ పాతబస్తీలో 'గోల్డ్ మ్యాన్'గా ప్రసిద్ధి చెందిన సూర్యా భాయ్ బండారం బట్టబయలైంది. కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు ధరించి తిరుగుతూ సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, వాస్తవానికి నకిలీ నగలు ధరిస్తున్నాడని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ విచారణలో తేలింది. దీంతో అత్తాపూర్‌కు చెందిన పల్లపు సురేశ్ కుమార్ అలియాస్ సూర్యా భాయ్ ఇమేజ్ ఒక్కసారిగా తలకిందులైంది. అసలు ఈ విషయం ఎలా బయటపడిందంటే కొండా విజయ్ కుమార్ అనే వ్యక్తిపై జరుగుతున్న ఐటీ విచారణలో భాగంగా సూర్యా భాయ్ పేరు వెలుగులోకి వచ్చింది. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ విమానాశ్రయంలో విజయ్ కుమార్ నుంచి అధికారులు 1.4 కిలోల అసలైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించినప్పుడు సూర్యా భాయ్‌ను గుర్తించి విచారణ చేపట్టారు.

శుక్రవారం ఐటీ అధికారుల ఎదుట హాజరైన సూర్యా భాయ్, తాను ధరించిన 12 ఆభరణాల విలువ సుమారు రూ.1 కోటి అని మొదట చెప్పారు. అయితే, అధికారుల ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అనుమానం బలపడింది. చివరికి ఆ నగలు రాగితో చేసి రోడియం పూత వేసినవని, వాటి విలువ కేవలం రూ.3 లక్షలు మాత్రమేనని అంగీకరించారు. ఒక్క ఆభరణం మాత్రమే వెండిపై బంగారు పూత వేసిందని తేలింది. యూట్యూబ్ ఇంటర్వ్యూలు, సోషల్ మీడియాలో ధనవంతుడిగా కనిపించేందుకు సూర్యా భాయ్ సుమారు 32 రకాల నకిలీ ఆభరణాలను వాడినట్లు విచారణలో వెల్లడైంది. రంగు మారినప్పుడల్లా వాటిని మార్చేవాడని తెలిసింది. ఈ ఘటనతో పాతబస్తీలో 'గోల్డ్ మ్యాన్' కాస్తా 'రోల్డ్ గోల్డ్ మ్యాన్' అయ్యాడంటూ స్థానికులు, నెటిజన్లు ఎగతాళి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఐటీ శాఖ లోతుగా దర్యాప్తు చేస్తోంది. లోతైన విచారణలో సూర్యా భాయ్ ఆర్థిక పరిస్థితి గురించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతనికి సొంత ఇల్లు లేదని, రూ.20 వేల అద్దె ఇంట్లో నివసిస్తున్నాడని తేలింది. గత ఆరేళ్లుగా ఐటీ రిటర్నులు దాఖలు చేయని అతను, కేవలం 2022-23లో రూ.4.9 లక్షల ఆదాయం చూపాడు. థార్, సఫారీ వంటి వాహనాలు ఉన్నప్పటికీ, అవి కేవలం ప్రదర్శన కోసమేనని, భూవివాదాల సెటిల్మెంట్ల ద్వారా వచ్చిన కమీషన్లతో కొన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రజల్లో గుర్తింపు, సినిమా అవకాశాలు పొందాలనే ఉద్దేశంతోనే ఇలా 'గోల్డ్ మ్యాన్'గా ప్రచారం చేసుకున్నానని విచారణలో సూర్యా భాయ్ అంగీకరించినట్లు తెలిసింది. తాను 'గటికుడు' అనే సినిమాలో చిన్న పాత్రలో నటించానని కూడా చెప్పాడు. విచారణ అనంతరం అతడిని విడిచిపెట్టినప్పటికీ, ప్రధాన సూత్రధారి అయిన విజయ్ కుమార్ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఐటీ అధికారులు స్పష్టం చేశారు.

# భూమి పట్టాల పంపకంలో

# అధికారులకు ఎవరెవరికి ఎంతెంత.?

- యేసు లింగయ్య భూమిలో పెద్ద మనుషులే భూ బకాసురులుగా మారిన వైనం
- దాసరి రాయలింగు తండ్రి బాలయ్య భూమి ఎవరి పాలయింది.? ఎలా అయింది.?
- భూమి వ్యవహారములో ఎవరెవరు పెద్ద తలలున్నాయి.?
- భూమి వ్యవహారములో ఎవరెవరికి ఎంత కాసులు చేతులు మారాయి.?






**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలంలోని పోతారం గ్రామంలో సర్వేనెంబర్ 190 నాగారం శివారులోని ఏడు ఎకరాల భూమి ఓల్డ్ పానీలో ఉన్న భూమిలో దాసరి రాయలింగ్ పేరుమీద ఉన్న భూమి లో ధరణిలో ఉప్పులపూ సత్తమ్మ పేరు మీదికి ఎలా మారింది. ధరణి మాయజాలం అంతుపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భూమిని రెవెన్యూ వాళ్లు కావాలని చేసినారా.? లేక ఏదైనా ప్రలోభాలకు లొగ్గారా.? ఈ వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది, అధికారులకు ఎవరెవరికి ఎంత మొట్టింది.? ఎవరి హస్తములతో భూమి మార్పిడి జరగడానికి కారకులయ్యారు అన్న ప్రశ్నలు స్థానికులలో తలెత్తాయి. మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలోనీ అధికారుల అండదండలతో ఈ మాయజాలం జరిగిందన్నడానికి ఇదే నిదర్శనం అని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి రెవెన్యూ సిబ్బంది కూడా సహకరించింది అనడానికి ఎలాంటి సందేహమే లేదన్న విమర్శలు ఉన్నాయి. పోతారం గ్రామంలోని మరొక సర్వేనెంబర్ 147 దాసరి స్వామి అనే వ్యక్తి కవులకు ఈ భూమిని దున్నుతూ తానే కబ్జా చేసుకుని ఈ భూమికి నేనే అధికారినని అన్ని నేనే అని విర్రవీగుతున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తధానంతరం 190 సర్వే నంబర్ లోని ఏడెకరాల భూమిలో రెండు ఎకరాలు దానం అనీల్ కు ఎలా కట్టబెట్టారు. ఎవరు కట్టబెట్టారు.? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరో మూడు ఎకరాలు భూమిని గాజుల స్వామి పేరు మీద ఎలా మార్పిడి జరిగింది దీనిని ఎవరు పట్టా చేశారు.? మిగిలిన రెండు ఎకరాల భూమి ఉప్పులకు సత్తమ్మ పేరు మీదికి ఎలా వెళ్ళింది ఇదంతా రెవెన్యూ కనుసన్లో జరిగిందని అనడానికి భూమి మార్పిడి నిదర్శనం అని గ్రామంలో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ భారీ అవినీతిపై గ్రామములోని ప్రజలు రకరకాలుగా గుసగుసలుగా మాట్లాడుకుంటున్నారు . ఇకనుండైనా ఈ మాయాజాల పోగొట్టను ఛేదించేది ఎవరు భూమి అంటేనే రెవెన్యూ అధికారులకు కాసుల పంటని ప్రజలు విచ్చలవిడిగా మాట్లాడుకుంటున్నారు. మరి ఇలాంటి భూమికి ఎంత డబ్బు ఎవరెవరి చేతులు మారాయో ఎలా చేశారో అన్నదానిపై కలెక్టర్ పూర్తి విచారణ చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే భూమిని ఇలా ఎవరికో అర్థం తరంగా కట్టబెడుతుంటే అధికారులు రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే ప్రజాపాలనని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనుండి అయినా ఇలాంటి వాటికి చెక్కు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. నాగారం 47 సర్వే నంబర్లో దాసరి స్వామి అనే వ్యక్తి కౌలుకు తీసుకొని ఈ భూమి నాది అనడం ఎంత మట్టుకు సమంజసం అని ఇవన్నీ రెవెన్యూ అధికారులకు తెలిసి జరిగిందా.? తెలియక జరిగిందా.? అధికారులకు లంచాలు ఇచ్చి చేస్తున్నారా.? అర్థం కావడం లేదనీ స్థానికులు మండిపడుతున్నారు. సమాచారంతో ప్రజల ఆరోపణలతో పోతారం గ్రామంలో జరుగుతున్న పరిణామాలకు ఎవరు కారకులు అడ్డగోలుగా ఒకరి భూమిని మరొకరు పట్టాలు చేసుకుంటే అన్నీ తెలిసి కూడా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా చూస్తూ వ్యవహరించడం వెనుక మామూళ్లే కారణమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పన్నుల రూపంలో కట్టే సొమ్ముతోని జీతాలు తీసుకునే అధికారులు ఇలా చేస్తే పేద ప్రజలు ఎవరికి చెప్పుకోవాలి.

ఈ వ్యవహారం అంతా ఉన్నత అధికారులకు కనబడటం లేదా.? ఇకనుండి అయిన రెవెన్యూ అధికారులు తీరు మారాలి. దీనిపై స్పందించి ఈ పరిష్కారానికి మార్గం వెతకాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం కూడా దీనిపై స్పందించి తక్షణ చర్యలుగా మంథని రెవెన్యూ పరిధిలో ఎన్నో భూ వ్యవహారాలు ఇలా జరుగుతున్న కలెక్టర్ స్పందించి చొరవ చూపి ఇలాంటి భూదందాలకు చెక్కు పెట్టాలని గణేష్ కోరుతున్నారు.

# రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఒకటే

**- హరీష్ రావు జాగ్రత్తలు చెప్పిన బండి సంజయ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. అసెంబ్లీ సాక్షిగా అధికార, విపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఆదివారం రోజున అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు సరైంది కాదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇక కౌశిక్ రెడ్డి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎథిక్స్ కమిటీకి పంపించడాన్ని బండి సంజయ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఎథిక్స్ కమిటీయే లేదని అసలు అసెంబ్లీ కమిటీలే లేవని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పాడి కౌశిక్ రెడ్డి అంశాన్ని లేని కమిటీకి పంపించడం ఏంటని బండి సంజయ్ ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన బండి సంజయ్ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ ఇద్దరూ ఒక్కటేనని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ-రేసు కేసును సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఈ వ్యవహారంలో అవగాహన కుదిరిందని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో బీజేపీపై తుపాకీ పెట్టి కాలుస్తానని సీఎం రేవంత్ రెడ్డి అనుకుంటే తాము ఊరుకునే ప్రసక్తే లేదని బండి సంజయ్ తేల్చి చెప్పారు.మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్నట్లు బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు ఎప్పటికీ జరగదని ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ క్లారిటీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తమ బీజేపీ పార్టీ ఎప్పటికీ దూరంగానే ఉంటుందని స్పష్టం చేశారు. వారసత్వ, కుటుంబ రాజకీయాలకు బీజేపీ ఎప్పటికీ వ్యతిరేకమని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి డిప్రెషన్‌లో ఉండి నియోజకవర్గాల పునర్విభజనపై మాటలు మాట్లాడుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. హరీష్ రావు మీద ఉన్న కసి కేటీఆర్ మీద సీఎం రేవంత్ రెడ్డికి ఎందుకు తగ్గిందని ఈ సందర్భంగా బండి సంజయ్ నిలదీశారు. ఈ విషయంలో హరీష్ రావు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. విడిపోయిన కేటీఆర్, కవితలను రేవంత్ రెడ్డి కలిపే ప్రయత్నం చేస్తున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు. అందు కోసం రహస్య ఒప్పందాలు జరిగాయని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ సాక్షిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న రహస్య బంధం బయటపడిందని బండి సంజయ్ ఆరోపించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588